ట్రాన్స్‌జెండర్ హత్య కేసులో నిందితుడి అరెస్టు
- వివరాలు వెల్లడించిన జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా
- పెళ్లి విషయంలో ఇరువురి మధ్య కొంతకాలంగా గొడవ
- రెండో పెళ్లి చేసుకుంటానన్న బన్నీ - 8లో
- తనను మాత్రమే వివాహం చేసుకోవాలని పట్టుబట్టిన దీపు
- ట్రాన్స్‌జెండర్‌ను వదిలించుకోవాలన్న ఉద్దేశంతో హత్య

ఉపాధి పనుల్లో ఎఫ్‌ఏల చేతివాటం

పనులకు రానివారికి కూడా మస్తర్లు

- అనకాపల్లి పట్టణంలో ఉంటున్న మహిళకు భట్లపూడిలో జాబ్ కార్డు
- మరో మహిళ బ్రాండిక్స్‌లో ఉద్యోగి.. ఉపాధి పనులకు వచ్చినట్టు మస్తర్లు
- ఆయా వ్యక్తుల నుంచి లంచాలు తీసుకున్నట్టు ఆరోపణలు
- సామాజిక తనిఖీ ప్రజావేదికలో వెల్లడించిన అధికారులు



భట్లపూడి ఫీల్డ్ అసిస్టెంట్ పండూరి లలితను ప్రశ్నిస్తున్న అధికారులు

తుమ్మపాల (అనకాపల్లి), మార్చి 20 (ఆంధ్రజ్యోతి):

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిర్వహణలో సిబ్బంది మస్తర్ల మాయాజాలం చేశారు. పనులకు రాకపోయినప్పటికీ వచ్చినట్టు మస్తరు వేశారు. పచ్చదనం కోసం మొక్కలు నాటినట్టు రికార్డుల్లో చూపి నిధులు స్వాహా చేశారు.

జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా) పీడీ ఆర్.పూర్ణిమాదేవి, ఉపాధి హామీ పథకం ఏపీడీ మణికుమార్, జిల్లా విజిలెన్స్ అధికారి, నిర్మలాదేవి, ఎంపీడీవో నరసింహారావు, ఎంపీపీ గొర్లి సూరిబాబు, తదితరుల ఆధ్వర్యంలో గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ పథకం పనుల సామాజిక తనిఖీ ప్రజావేదికను నిర్వహించారు. మండలంలో దాదాపు అన్ని పంచాయతీల్లో నిర్వహించిన ఉపాధి పనుల్లో ఫీల్డ్ అసిస్టెంట్లు (ఎఫ్‌ఏ) పలు అక్రమాలు, అవినీతికి పాల్పడినట్టు వివరాలతో సహా వెల్లడించారు. కొంతమంది ఉపాధి కూలీలతో ఫీల్డ్ అసిస్టెంట్లు కుమ్మక్కయ్యారు. ఉపాధి పనులకు రాకపోయినా మస్తర్లు వేశారు. వచ్చిన వేతనం సొమ్మును పంచుకున్నారు. అలాగే పలు పంచాయతీల్లో ఉపాధి కూలీల సంతకాలు, వేలిముద్రలు లేకుండానే పేమెంట్లు చేసినట్టు గుర్తించారు. ప్రధానంగా మాకవరం, సీహెచ్‌ఎన్ అగ్రహారం, రేబాక, కోడూరు, భట్లపూడి పంచాయతీల్లో మస్తర్లలో తేడాలు కనిపించాయి. గ్రామాల్లో రహదారుల పక్కన, చెరువు గట్లపైన మొక్కలు నాటి, వాటిని సంరక్షించినట్టు రికార్డుల్లో నమోదు చేశారు. కానీ క్షేత్రస్థాయిలో ఎక్కడా మొక్కలు కనిపించడంలేదు.

భట్లపూడి ఫీల్డ్ అసిస్టెంట్ పండూరి లలిత తీవ్ర అక్రమాలకు పాల్పడినట్టు పూర్తి ఆధారాలను డ్వామా పీడీ పూర్ణిమాదేవికి అందజేశారు. అనకాపల్లి అర్బన్ ప్రాంతానికి చెందిన పసుపులేటి లక్ష్మికి భట్లపూడిలో జాబ్‌కార్డు ఇచ్చారు. అంతేకాక ఉపాధి పనులకు రాకపోయినా 2020 నుంచి వేతనాలు చెల్లిస్తున్నారు. ఇందుకు ప్రతిఫలంగా పసుపులేటి లక్ష్మి నుంచి ఫీల్డ్ అసిస్టెంట్ లలిత రూ.25 వేలు తీసుకున్నట్టు వెల్లడించారు. ఇదే గ్రామానికి చెందిన బుదిరెడ్డి లక్ష్మి బ్రాండిక్స్ కంపెనీలో విధులకు వెళుతుండగా, ఉపాధి పనులకు వస్తున్నట్టు ... మిగతా 8వ పేజీలో

ప్రజలకు చేరువగా ఎమ్మెల్యేలు

ప్రతి బుధవారం నియోజకవర్గంలో సమావేశం

- ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ప్రజల నుంచి వినతులు స్వీకరణ
- అనంతరం పార్టీ కేడర్‌తో సమావేశం
- సంస్థాగత నిర్మాణం, కార్యకర్తలు, ప్రజల సమస్యలపై చర్చ
- పార్టీ కేంద్ర కార్యాలయానికి నివేదిక
- సమావేశాలు నిర్వహించకపోతే అధిష్ఠానానికి వివరణ ఇవ్వాలి
- నెలలో రెండు రోజులు జిల్లా ఇన్‌చార్జి మంత్రి పర్యటన
- మొదటి రోజు అధికారులతో, రెండో రోజు పార్టీ కేడర్‌తో సమావేశాలు
- టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు వెల్లడి



బత్తుల తాతయ్యబాబు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు

అనకాపల్లి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి):

తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు ప్రజా సమస్యలపై ప్రతి బుధవారం అసెంబ్లీ నియోజకవర్గం స్థాయిలో సమావేశాలు నిర్వహించనున్నట్టు పార్టీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

స్థానిక ఎమ్మెల్యే లేదా నియోజకవర్గం ఇన్‌చార్జి ప్రతి బుధవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తారని చెప్పారు. మధ్యాహ్నం తరువాత పార్టీ క్యాడర్‌తో సమావేశమై, పార్టీ సంస్థాగత నిర్మాణం, కార్యకర్తల సమస్యలు, ప్రజల నుంచి అందిన వినతులపై చర్చించాలన్నారు. పార్టీ కోసం బాగా పనిచేస్తున్న కార్యకర్తలను అభినందించి, ఇందుకు సంబంధించిన నివేదికను పార్టీ ప్రధాన కార్యాలయానికి పంపాలని సూచించారు. ఇక జిల్లా ఇన్‌చార్జి మంత్రులు నెలలో రెండు రోజులు జిల్లాలో పర్యటిస్తారని ఆయన తెలిపారు. తొలిరోజు అధికారులతో సమావేశం నిర్వహిస్తారని, రెండో రోజు టీడీపీ పార్లమెంట్ ... మిగతా 8వ పేజీలో

అంగన్‌వాడీలకు గూడు

జిల్లాలో 141 అసంపూర్తి భవనాలకు నిధులు మంజూరు

- అద్దె ఇళ్లు, పరాయి పంచన నిర్వహిస్తున్న కేంద్రాలకు కూడా సొంత భవనాలు
- మౌలిక వసతుల కల్పనకు నిధుల కోసం ప్రతిపాదనలు



పాయకరావుపేట మండలం ఈదటం గ్రామంలో పూర్తికాని అంగన్‌వాడీ భవనం

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

జిల్లాలో అసంపూర్తిగా వున్న అంగన్‌వాడీ కేంద్రాల భవనాల పెండింగ్ పనులు పూర్తిచేసి అందుబాటులోకి తేవాలని రాష్ట్ర ప్రభుత్వం అధికారులను ఆదేశించింది. అదే విధంగా అద్దె భవనాలు, పరాయి పంచన నడుస్తున్న అంగన్‌వాడీ కేంద్రాలకు కూడా సొంత భవనాలు నిర్మించేందుకు సన్నాహాలు చేస్తున్నది.

జిల్లాలో మొత్తం 1,908 అంగన్‌వాడీ కేంద్రాలు వున్నాయి. వీటిలో అత్యధికంగా 1,712 కేంద్రాలు గ్రామీణ ప్రాంతంలో వుండగా, మిగిలిన 196 కేంద్రాలు జీవీఎంసీ అనకాపల్లి జోన్, నర్సీపట్నం, ఎలమంచిలి మునిసిపాలిటీల్లో ఉన్నాయి. ఐదేళ్ల క్రితం జిల్లాలో 881 అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు ఉన్నాయి. 411 కేంద్రాలు అద్దె భవనాల్లో, 616 కేంద్రాలు ఇతర ప్రభుత్వ శాఖలకు చెందిన ఇరుకు గదుల్లో నిర్వహిస్తున్నారు. గత ప్రభుత్వం జాతీయ ఉపాధి హామీ పథకం కన్వర్జెన్సీ నిధులతో జిల్లాలో రెండు దశల్లో 629 అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాల నిర్మాణానికి ఆమోదం తెలిపింది. ఒక్కో భవనం అంచనా వ్యయం రూ.15 లక్షలు. ఇందులో 60 శాతం కేంద్ర ప్రభుత్వం, 40 శాతం రాష్ట్ర ప్రభుత్వం భరించాలి. అధికారులు టెండర్లు పిలిచి, కాంట్రాక్టర్లకు పనులు అప్పగించారు. అయితే కేంద్రం ప్రభుత్వం తన వాటా నిధులు విడుదలచేయగా, నాటి వైసీపీ ప్రభుత్వం రాష్ట్ర వాటా నిధులు ఇవ్వలేదు. దీంతో భవన నిర్మాణాలు మందకొడిగా సాగాయి. పలు భవనాలు పునాదుల స్థాయిలోనే ఆగిపోయాయి. మొత్తం మీద 488 భవనాలు మాత్రమే అందుబాటులోకి వచ్చాయి. 141 భవనాలు వివిధ దశల్లో నిలిచిపోయాయి. గత ఏడాది సాధారణ ఎన్నికల తరువాత అధికారంలోకి వచ్చిన నూతన ప్రభుత్వం.. అసంపూర్తిగా వున్న భవనాలపై దృష్టి సారించింది.

వైసీపీ హయాంలో అసంపూర్తిగా నిర్మించిన భవనాలకు ఎంత ఖర్చుచేశారు, ఇంకా చేయాల్సిన పనులకు ఎంత ఖర్చు అవుతుంది, కాంట్రాక్టర్లకు పెండింగ్ బిల్లులు ఎంతమేర వున్నాయి వంటి వివరాలను పంచాయతీరాజ్ శాఖ ఇంజనీరింగ్ విభాగం అధికారులు ఇప్పటికే మండలాల వారీగా నివేదిక రూపొందించి ప్రభుత్వానికి పంపారు. గతంలో చేపట్టిన పనులకు సంబంధించి కాంట్రాక్టర్లకు రూ.2.9 కోట్ల బకాయిలు వున్నట్టు అధికారులు గుర్తించారు.

పెండింగ్ బిల్లులు చెల్లిస్తే.. మిగిలిన పనులు పూర్తి చేస్తామని కాంట్రాక్టర్లు స్పష్టం చేశారు. అధికారులు ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. అసంపూర్తిగా వున్న భవనాలను పూర్తి చేయడంతోపాటు ఇంతవరకు సొంత భవనాలు లేని కేంద్రాలకు కూడా కొత్త భవనాలు నిర్మించాలని, ఇంకా ఆయా కేంద్రాల్లో మరుగుదొడ్లు, తాగునీరు, ఇతర మౌలిక సదుపాయాలను కల్పించాలని ప్రభుత్వం ఆదేశించింది. మౌలిక సదుపాయాల కోసం రూ.2 కోట్లు మంజూరు చేయాలని అధికారులు అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి నివేదిక పంపారు. జిల్లాలో అసంపూర్తిగా వున్న అంగన్‌వాడీ కేంద్రాల భవన నిర్మాణ పనులను త్వరలోనే పునఃప్రారంభిస్తామని పంచాయతీరాజ్ శాఖ ఇంజనీరింగ్ విభాగం జిల్లా అధికారి వీరన్నాయుడు 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధికి తెలిపారు. ప్రభుత్వం నుంచి ఆమోదం రాగానే పనులు ప్రారంభించి వేగంగా పూర్తి చేస్తామన్నారు.

చింతపండుకి గిరాకీ

కోనాం సంతలో కొనుగోలుకు వ్యాపారులు పోటీ

- 20 కిలోల చింతపండు రూ.1,500-రూ.1,700
- ఐదు వారాల నుంచి పెరుగుతున్న ధరలు
- గిరిజనుల ఆనందం



కోనాం సంతలో గిరిజనులు అమ్మకానికి తెచ్చిన చింతపండు

చీడికాడ, మార్చి 20 (ఆంధ్రజ్యోతి):

మండలంలోని కోనాం సంతలో చింతపండు కొనుగోలుకు వ్యాపారులు పోటీ పడుతున్నారు. గత ఐదు వారాల నుంచి ధరలు క్రమేపీ పెరుగుతుండడంతో గిరిజనులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఊరగాయపచ్చళ్ల సీజన్ కావడంతో చింతపండు వినియోగం అధికంగా వుందని, దీంతో ఎక్కువ ధరకు కొనుగోలు చేయాల్సి వస్తున్నదని వ్యాపారులు చెబుతున్నారు. ప్రతి గురువారం కోనాంలో జరిగే సంతకు చీడికాడతోపాటు పాడేరు, అనంతగిరి, హుకుంపేట మండలాల్లోని పలు గ్రామాల గిరిజనులు వ్యవసాయ, అటవీ ఉత్పత్తులను తీసుకువచ్చి విక్రయిస్తుంటారు. ప్రస్తుతం చింతపండు సీజన్ కావడంతో ఎక్కువ మంది కావిళ్లు, బుట్టలతో కోనాం సంతకు చింతపండు తీసుకువస్తున్నారు. సుమారు 20 కిలోల బరువు వుండే కావడి చింతపండు గత వారం రూ.1,400-రూ.1,500లకు వ్యాపారులు కొనుగోలు చేయగా, ఈ వారం మరో వంద రూపాయలు పెరిగింది. నాణ్యతనుబట్టి రూ.1,500 నుంచి రూ.1,700 వరకు కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా పాడేరు మండలం దబ్బగరువు గ్రామానికి చెందిన గిరిజన రైతు ఈశ్వరరావు మాట్లాడుతూ, నడుచుకుంటూ ఇంత దూరం మోసుకొచ్చినందుకు తగిన ధర లభించిందని సంతోషంగా చెప్పాడు. గత ఐదు వారాల నుంచి చింతపండు ధరలు క్రమేపీ పెరుగుతుండడంతో గిరిజనులు ఆనందం వ్యక్తంచేస్తున్నారు.

రంజాన్ వేళలు
ఇఫ్తార్ : 6.12 (శుక్రవారం సాయంత్రం)
సహర్ : 4.45 (శనివారం ఉదయం)

ప్రభుత్వ భూములు హాంఫట్!



వెదుళ్లనరవ సర్వే నంబరు 118లోని 40 సెంట్లతోపాటు రెండు మండలాల సరిహద్దులోని స్థలాన్ని కలిపి ప్రహరీ గోడ నిర్మించిన రియల్టర్

సబ్బవరం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి):

మండలంలోని వెదుళ్లనరవలో కోట్లాది రూపాయల విలుచేసే ప్రభుత్వ భూములను అక్రమార్కులు తమ గుప్పెట్లో పెట్టుకున్నారు. వాటిని స్వాధీనం చేసుకునేందుకు రెవెన్యూ అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. స్థానికులు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదు. పత్రికల్లో కథనాలు వస్తే మొక్కుబడిగా స్పందించి ఒక హెచ్చరిక బోర్డు పెట్టి చేతులు దులుపుకుంటున్నారు. కొద్ది రోజుల తరువాత అక్కడ బోర్డు కనిపించదు.

వెదుళ్లనరవలో దర్జాగా ఆక్రమించేస్తున్న రియల్టర్లు

- ప్రహరీ గోడలు సైతం నిర్మాణం
- పత్రికల్లో కథనాలు వస్తే తప్ప స్పందించని అధికారులు
- హెచ్చరిక బోర్డులు పెట్టి చేతులు దులుపుకుంటున్న వైనం
- స్థానికుల ఫిర్యాదులు బుట్టదాఖలు



వెదుళ్లనరవ సర్వే నంబరు 113లో గెడ్డవాగును ఆక్రమించి నిర్మించిన ప్రహరీ గోడ

వెదుళ్లనరవ సర్వే నంబరు 118లో 2.4 ఎకరాలు ప్రభుత్వ భూమి ఉంది. దీనిని కొంతమంది స్థానికులు క్రమేపీ ఆక్రమించుకుని విడదల వారీగా అమ్మేశారు. ఇప్పుడు అక్కడ 40 సెంట్లు మాత్రమే మిగిలింది. దీనికి ఆనుకొని ఖాళీ స్థలం(గ్యాప్ ఏరియా.. ఇది ఏ మండలం పరిధిలో వుందో రికార్డుల్లో లేదు) 87 సెంట్లు ఉంది. దీని పక్కన గాజువాక మండలం దువ్వాడ రెవెన్యూ పరిధి సర్వే నంబరు 140/5లో 2.32 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. దీనిని ఓ రియల్టర్ తన గుప్పెట్లో పెట్టుకున్నాడు. దీంతోపాటు మరికొంత జిరాయితీ భూమిని కలిపి లే-అవుట్ వేసి అమ్మేశాడు. అప్పటి తహసీల్దార్ ఎన్‌డీ అనిత మండలంలో ప్రభుత్వ భూములు సర్వే చేయించి హెచ్చరిక బోర్డులు పెట్టించారు. అప్పటి నుంచి రెండు మండలాలకు చెందని 87 సెంట్ల ఖాళీ స్థలంతోపాటు సర్వే నంబరు 118లోని 40 సెంట్లు ప్రభుత్వ భూమి కూడా ఖాళీగానే ఉంది. అయితే రియల్టర్ ఒకరు గత ఏడాది ఈ స్థలంలో నుంచి ప్రహరీగోడ నిర్మాణ పనులు ప్రారంభించాడు. దీనిపై నవంబరు 24న 'ఆంధ్రజ్యోతి'లో కథనం రావడంతో స్పందించిన హసీల్దార్ బి.చిన్నికృష్ణ.. ఆక్రమణకు గురైన స్థలాన్ని ... మిగతా 8వ పేజీలో



కాలిపోయిన జీడిమామిడి తోట

జీడిమామిడి తోటల్లో అగ్గి

- 50 ఎకరాల్లో కాలిపోయిన పంట
- రూ.50 లక్షలకుపైగా నష్టం

బుచ్చెయ్యపేట, మార్చి 20 (ఆంధ్రజ్యోతి):

మండలంలోని ఎల్‌బీపీ అగ్రహారం, బంగారుమెట్ట గ్రామాల సరిహద్దులోని జీడిమామిడి తోటల్లో గురువారం అగ్గిరాజుకుంది. సుమారు 50 ఎకరాల్లో తోటలు దగ్ధమయ్యాయి. మధ్యాహ్నం వరకు తోటల్లో వున్న రైతులు.. భోజనం చేయడానికి ఇళ్లకు వెళ్లారు. కొద్దిసేపటి తరువాత ఒకరిద్దరు రైతులు తిరిగి తోటల వద్దకు తిరిగి వస్తున్నారు. ఈ సమయంలో జీడిమామిడి తోటల్లో నుంచి పొగ, మంటలు ఎగిసిపడుతుండడంతో ఆందోళన చెంది పరుగు పరుగు అక్కడకు వెళ్లారు. మంటలు ఆర్పడానికి ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకపోవడంతో రావికమతం అగ్నిమాపక కేంద్రానికి ఫోన్‌చేసి సమాచారం అందించారు. ఫైర్ స్టేషన్ నుంచి సిబ్బంది వచ్చే సరికి తోటలన్నీ కాలిపోయాయి. కనిమిరెడ్డి దొంగబాబు, సత్తిబాబు, రాము, కురచా వరహాలు, మరికొంతమంది రైతులకు చెందిన సుమారు 50 ఎకరాల జీడిమామిడి తోటలు కాలిపోయాయి. ఈ ఏడాది కాపు బాగుందని, ఎకరాకు 15 బస్తాల వరకు జీడిపిక్కలు వస్తాయని భావించామని రైతులు చెప్పారు. అగ్నిప్రమాదం ఎలా జరిగిందో తెలియడంలేదని, కానీ ఎకరాకు లక్ష రూపాయలకుపైగా నష్టపోయామని వాపోయారు.

సాగునీటి కష్టాలకు తెర

మరమ్మతు పనులకు నిధులు మంజూరు చేసిన ప్రభుత్వం

- కాలువలపై మదుములకు గేట్లు ఏర్పాటు



శ్రీరాంపురం సమీపంలో మెరక కాలువ మదుముకు తలుపులు ఏర్పాటు చేస్తున్న సిబ్బంది. (ఇన్‌సెట్‌లో) గత ప్రభుత్వ హయాంలో మదుములు తలుపులు పాడైపోవడంతో అడ్డుగా కర్రలు, గోనె సంచులు పెట్టిన రైతులు

పాయకరావుపేట రూరల్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి):

మండలంలోని పలు గ్రామాల రైతులకు రానున్న ఖరీఫ్‌లో సాగునీటి కష్టాలు తీరనున్నాయి. శిథిలావస్థకు చేరిన మదుములు, గేట్ల మరమ్మతులకు నిధులు మంజూరు చేసింది. దీంతో ఇరిగేషన్ అధికారులు మరమ్మతు పనులు చేపట్టారు.

వైసీపీ ఐదేళ్ల పాలనలో సాగునీటి వనరులు తీవ్ర నిర్లక్ష్యానికి గురయ్యాయి. ఆనకట్టలు, కాలువలు, మదుములు, గేట్ల నిర్వహణను పూర్తిగా గాలికొదిలేసింది. దీంతో పొలాలకు నీరు సరిగా అందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడిన విషయం తెలిసిందే. మదుముల తలుపులు పూర్తిగా ధ్వంసం కావడంతో నీటికి అడ్డంగా అరటి బొందలు, తుక్కు అడ్డుగా వేసి పొలాలకు నీరు పారించుకునేవారు. గత ఏడాది కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత సాగునీటి వనరులపై దృష్టి సారించింది. మండలంలోని కాలువలపై మదుములు, తలుపుల మరమ్మతులకు విడతల వారీగా నిధులు మంజూరు చేస్తున్నది. మొదటి విడత రూ.30.42 లక్షలతో శ్రీరాంపురం, గోపాలపట్నం, పెదరాంభద్రపురం, కేశవరం, రాజగోపాలపురం, పెంటకోట, సత్యవరం, మాసాహెబ్‌పేట, గుంటపల్లి తదితర గ్రామాల పరిధిలోని 11 ప్రాంతాల్లో మదుములకు కొత్త తలుపులు అమర్చారు. రెండవ విడతలో సుమారు రూ.75 లక్షలతో భూమి కాలువపై మదుములు, తలుపుల మరమ్మతులకు ప్రతిపాదనలు పంపినట్టు ఇరిగేషన్ శాఖ ఏఈఈ జి.శ్రీరామ్మూర్తి తెలిపారు. ఆమోదం లభించిన వెంటనే పనులను ప్రారంభిస్తామన్నారు.

డొనేషన్ ఇస్తేనే సుఖీభవ కార్డులు

- ఇదీ విశాఖ డెయిరీ అధికారుల తీరు
- తప్పని పరిస్థితుల్లో డొనేషన్ చెల్లిస్తున్న పాల సొసైటీలు
- గగ్గోలు పెడుతున్న రైతులు



విశాఖ డెయిరీకి పంపిన అమౌంట్



మడుతూరు పాల సేకరణ కేంద్రం



విశాఖ డెయిరీకి పంపిన డొనేషన్

అచ్యుతాపురం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): పాలు పోసే రైతులు డొనేషన్ ఇస్తేనే సుఖీభవ కార్డులను విశాఖ డెయిరీ అధికారులు మంజూరు చేస్తున్నారు. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో రైతులు డొనేషన్‌ను చెల్లిస్తున్నారు. డెయిరీ యాజమాన్యం నిర్ణయంపై పాడి రైతులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

ప్రతీ నెల 200 లీటర్లు పాలు పోసిన రైతుకు విశాఖ డెయిరీసుఖీభవ కార్డు మంజూరు చేస్తుంది. ఈ కార్డు ద్వారా కుటుంబంలో నలుగురుకి ఉచితం/రాయితీపై వైద్యం చేయించుకోవచ్చు. ఈ కార్డు కోసం పాడి రైతు సంవత్సరానికి రూ.500, పాల సేకరణ సంఘం తరపున రూ.500 చెల్లిస్తే.. విశాఖ డెయిరీ యాజమాన్యం రూ.600 కలిపి నిధిని ఏర్పాటు చేస్తుంది. దీని ద్వారా పాడి రైతులకు వైద్యం అందిస్తుంది. ఉత్తరాంధ్ర మూడు జిల్లాల పరిధిలో విశాఖ డెయిరీకి ఇటువంటి పాడి రైతులు 1.5 లక్షల మంది ఉన్నారు. ఏటా ఈ సుఖీభవ నిధి కింద రూ.24 కోట్లు వస్తుంది. ప్రతి సంవత్సరం ఈ ప్రకారం చెల్లింపులు జరిపి సుఖీభవ కార్డు రెన్యూవల్ చేస్తారు. కాని ఈ సంవత్సరం మాత్రం డొనేషన్ కడితే తప్ప సుఖీభవ కార్డు రెన్యూవల్ చేయవద్దని పాల సేకరణ కేంద్రాల అధ్యక్షులకు మౌఖిక ఆదేశాలు వచ్చాయి.

ఎంత కట్టాలి?

గ్రామాల్లో పాల సేకరణ లీటర్లలో జరుగుతుంది. కాని విశాఖ డెయిరీ మాత్రం చెల్లింపులు కేజీల్లో జరుపుతుంది. రైతుల నుంచి సేకరించిన కేజీ పాలకు విశాఖ డెయిరీ రూ.325 ప్రకటించింది. కాని రైతులకు మాత్రం రూ. 295 మాత్రమే చెల్లిస్తుంది. మిగిలిన రూ.30 మూడు నెలలకొకసారి పాలసంఘం ఖాతాకు జమ చేస్తుంది. ఇలా సంవత్సరానికి నాలుగు సార్లు జమ చేస్తుంది. దీనినే తిరిగి రైతులకు బోనస్ కింద ఇస్తారే తప్ప యాజమాన్యం తన లాభాల్లో ఒక్క రూపాయి కూడా రైతులకు బోనస్ కింద ఇవ్వదని ఒక పాల సంఘం అధ్యక్షుడు తెలిపారు. కాగా సుఖీభవ కార్డు రెన్యూవల్ కావలసిన వారు మూడు నెలలకు వచ్చే బోనస్‌ను డొనేషన్ కట్టాలని మౌఖిక ఆదేశాలు జారీ చేశారు. ఉత్తరాంధ్ర జిల్లాలోని విశాఖ డెయిరీ పాలసేకరణ కేంద్రాలన్నీ డొనేషన్లు కట్టేశాయి. అయితే అచ్యుతాపురం మండలంలో చీమలాపల్లి, మడుతూరు, నర్సీపట్నం మండలంలో మరో రెండు పాలసేకరణ కేంద్రాలు కట్టలేదు. ఒత్తిడి ఎక్కువగా ఉండడంతో 3500 పాడి రైతు సభ్యులు గల మడుతూరు పాలసేకరణ కేంద్రం ప్రతి సంవత్సరం మాదిరిగా సుఖీభవ కార్డు కోసం రైతుల నుంచి రూ.500, పాల సేకరణ కేంద్రం తరఫున రూ.500 చొప్పున గురువారం విశాఖ డెయిరీకి రూ.3.56 లక్షలు, డొనేషన్ కింద అదనంగా మరో రూ.5 లక్షల 61 వేల 734 చెల్లించారు. చీమలాపల్లి మాత్రం నెఫ్ట్ కాకపోవడంతో గురువారం కట్టలేకపోయారు. డొనేషన్ ఇస్తేనే సుఖీభవ కార్డులు రెన్యూవల్ కావని డెయిరీ అధికారులు చెప్పడంతో చెల్లించాల్సి వచ్చిందని మడుతూరు పాల సేకరణకేంద్రం అధ్యక్షుడు శనివాడ ఆనందరావు తెలిపారు. ఇలా చెల్లించమని ఎటువంటి సర్క్యులర్‌లు జారీ చేయలేదని, అనధికారికంగానే డెయిరీ అధికారులు చెబుతున్నారన్నారు.

మంత్రి దృష్టికి ఎలమంచిలి రోడ్ల దుస్థితి

- ఆర్‌అండ్‌బీ మంత్రి జనార్దన్ రెడ్డిని కలిసిన ప్రగడ



రోడ్లు భవనాల శాఖ మంత్రి జనార్దన్ రెడ్డితో ప్రగడ నాగేశ్వరరావు

అచ్యుతాపురం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఎలమంచిలి నియోజకవర్గంలో రహదారుల దుస్థితిపై రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డిని కోరానని రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు తెలిపారు. గురువారం ఆయన అమరావతిలో మంత్రిని మర్యాద పూర్వకంగా కలిశారు. లమంచిలి నియోజకవర్గం పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతోందని, సెజ్‌లో కర్మాగారాలకు భారీ యంత్రాలతో వాహనాలు వస్తున్నాయన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో రహదారుల గురించి అసలు పట్టించుకోలేదన్నారు. వాటి వల్ల రోడ్లు పాడయ్యాయన్నారు. అంతేకాక ట్రాఫిక్ విపరీతంగా పెరగడంతో రోడ్లు విస్తరణ చేయాల్సిన అవసరం ఉందని వివరించగా మంత్రి సానుకూలంగా స్పందించారని ప్రగడ నాగేశ్వరరావు తెలిపారు.

బార్క్ సరిహద్దు నిర్మాణ పనులు అడ్డగింత



బార్క్ సరిహద్దు పనులను అడ్డుకుంటున్న రావిపాలెం గ్రామస్థులు

అచ్యుతాపురం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): బార్క్ సరిహద్దు నిర్మాణ పనులను రావిపాలెం గ్రామస్థులు గురువారం అడ్డుకున్నారు. తమ సమస్య పరిష్కరించేంత వరకు పనులు జరగనివ్వమని వారు స్పష్టం చేశారు. దీంతో పనులు నిలిపేసి అధికారులు వెనుదిరిగారు. దోసూరు పంచాయతీ రావిపాలెం గ్రామానికి చెందిన 600 ఎకరాలు బార్క్ కోసం ఏపీఐఐసీ 2014లో సేకరించింది. అప్పట్లో 400 ఎకరాల జిరాయితీ భూములకు ఎకరాకు రూ.18 లక్షలు చొప్పున పరిహారం ఇచ్చారు. డి పట్టాదారులతోపాటు సాగుదారులకు ఇంతవరకు పరిహారం ఇవ్వలేదు. రావిపాలెంలో సుమారు 200 కుటుంబాలున్నాయి. వీరందరి భూములను కూడా ఏపీఐఐసీ సేకరించింది. కేవలం ఐదెకరాల పరిధిలో గ్రామం మాత్రమే మిగిలి ఉంది. సర్వం కోల్పోయామని, ఆర్‌ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని గ్రామస్థులు ఆది నుంచి పోరాడుతున్నారు. అయితే అధికారులు గాని, ప్రజాప్రతినిధులు గాని ఇంత వరకు పట్టించుకోలేదు. ప్రస్తుత ప్రభుత్వం పనులు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించింది. దీంతో రికార్డుల ప్రకారం భూమిని స్వాధీనం చేసుకోవడానికి రెవెన్యూ అధికారులు సిద్ధమయ్యారు. యంత్రాల సాయంతో సరిహద్దుల్లో ప్రహరీ నిర్మించాలని అధికారులు భావించారు. కాని గురువారం రైతులు అడ్డుకున్నారు. ప్రహరీ నిర్మిస్తే తాము గ్రామం నుంచి బయటకు వచ్చే మార్గమే ఉండదని, తమకు ముందుగా పునరావాసం కల్పించిన తర్వాతే పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. అలాగే డి పట్టా, సాగుదారులకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. కాగా ఈ వ్యవహారంలో అచ్యుతాపురం డీటీ శ్యామ్ కుమార్ అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారని జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు నర్మాల కుమార్ ఆరోపించారు. భూములను ఏపీఐఐసీ సేకరించిందని, తమ న్యాయమైన డిమాండ్లు ఏపీఐఐసీ అధికారులు పరిష్కరించాలన్నారు. కాని డీటీ వచ్చి పనులను అడ్డుకుంటే పోలీసులకు ఫిర్యాదు చేస్తానని బెదిరిస్తున్నారన్నారు. జిల్లా కలెక్టర్ తమ సమస్యను పరిష్కరించాలని కోరారు.

‘ఉపాధి కూలీల బకాయిలను వెంటనే చెల్లించాలి’



చినకలవలాపల్లిలో ఉపాధి కూలీల సమస్యలు తెలుసుకుంటున్న సీపీఎం నాయకుడు లోకనాథం

రాంబిల్లి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఉపాధి కూలీల బకాయిలను ప్రభుత్వాలు వెంటనే చెల్లించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం డిమాండ్ చేశారు. గురువారం ఆయన ఆ పార్టీ నాయకులతో కలిసి జడ్‌చింతువా, కొత్తపేట, చినకలవలాపల్లి గ్రామాల్లో ఉపాధి కూలీలను కలిసి వారి సమస్యలను తెలుసుకున్నారు. 5 నుంచి 8 వారాలు పనిచేసి కూలి డబ్బులు చెల్లించలేదని, మండుటెండలో పనిచేస్తున్నా కనీస సౌకర్యాలు కల్పించలేదని ఉపాధి కూలీలు తెలిపారు. అనంతరం లోకనాథం మాట్లాడుతూ ఉపాధి కూలీల సమస్యలను సకాలంలో పరిష్కరించాలని డిమాండ్ చేశారు. గ్రామంలో కొండ చుట్టూ ఎన్‌ఏఓబీ ప్రహరీ నిర్మాణంతో నష్టపోతున్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు.

పాడి మీదే ఆధారపడి జీవనం సాగించే రైతులకు తీవ్ర నష్టం జరిగిందన్నారు. కలెక్టర్ స్పందించి చినకలవలాపల్లి గ్రామాన్ని సందర్శించి, వారి సమస్యలను త్వరగతిన పరిష్కరించాలని లోకనాథం కోరారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి జి.దేముడునాయుడు, మండల నాయకులు ఎన్.నారాయణరావు, చందక రామకృష్ణ, ఎరిపిల్లి రాము, దేని, కాశియ్య, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

ఎలమంచిలి నూకాంబిక జాతరకు ఏర్పాట్లు



నూకాంబిక అమ్మవారి ఆలయానికి రంగులు వేసిన దృశ్యం

ఎలమంచిలి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): కొత్త అమావాస్య జాతరకు పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఉన్న నూకాంబిక అమ్మవారి ఆలయాన్ని ముస్తాబు చేస్తున్నారు. ఆలయానికి రంగులు వేసి, సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. కమిటీ ప్రతినిధులు శ్రీరాములు నాయుడు, లక్ష్మీనారాయణ, గంధం శివ సమక్షంలో గురువారం ఆలయ గోపురానికి ప్రత్యేక రంగులను వేశారు.

ఆలయ ప్రధాన ద్వారం వద్ద భక్తులకు అసౌకర్యం కలగకుండా క్యూ లైన్లు ఏర్పాటుతోపాటు టెంట్‌లను వేస్తున్నారు. భక్తుల కోసం తాగునీరు, మజ్జిగ కౌంటర్లను ఏర్పాటు చేయనున్నారు. వారం రోజుల నుంచి ఆలయ సుందరీకరణ పనులు చేపడుతున్నామని, దాతలు, భక్తులు అందరి సహకారంతో కొత్త అమావాస్య జాతరకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని కమిటీ ప్రతినిధులు తెలిపారు.

సంతబయలు వినాయకునికి వార్షికోత్సవ పూజలు

మునగపాక, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంత బయల ప్రాంతంలో విఘ్నేశ్వరస్వామికి గురువారం వార్షికోత్సవ పూజలు నిర్వహించారు. వినాయక విగ్రహానికి జల, పాల, పెరుగు, తేనెలతో అభిషేకాలు చేశారు. ఉదయం నుంచి భక్తులు దర్శించుకొని పూజలు చేశారు. దేవస్థానం కమిటీ చైర్మన్ మందపాటి శ్రీరామ వెంకట నరసింగరావు(రాము) ఆధ్వర్యంలో అర్చకులు రాంబాబు, నాని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఉపాధి కూలీల నిరసన



వమ్మవరంలో నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధి కూలీలు

ఎస్.రాయవరం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): తొమ్మిది వారాలుగా కూలి చెల్లించకపోవడంతో మండలంలోని వమ్మవరం ఉపాధి కూలీలు గురువారం వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.సత్యనారాయణ ఆధ్వర్యంలో ఉపాధి కూలీలు పచ్చగడ్డి నోటిలో పెట్టుకొని నిరసన వ్యక్తం చేశారు.

ధర్మవరం, వమ్మవరం గ్రామాల్లో నిర్వహించిన ప్రజా చైతన్య యాత్రలో ఉపాధి కూలీల సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సత్యవతి, రత్నం, సూరిబాబు, కొండమ్మ, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

పేలుళ్లతో ఇళ్ల గోడలకు బీటలు

- టీడీపీ మండల అధ్యక్షుడు చిట్టిబాబు



అధికారులతో మాట్లాడుతున్న టీడీపీ మండల అధ్యక్షుడు పి.చిట్టిబాబు

పాయకరావుపేట, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : పట్టణాన్ని ఆనుకుని జరుగుతున్న పోలవరం ఎడమ కాలువ పనుల్లో చేపడుతున్న బాంబు పేలుళ్ల తీవ్రత తగ్గించాలని టీడీపీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు అధికారులను కోరారు. పట్టణ శివారులో జరుగుతున్న పోలవరం ఎడమ కాలువ నిర్మాణ పనుల్లో భాగంగా కొండను బద్దలు కొట్టేందుకు కొద్ది రోజులుగా బాంబు పేలుళ్లను చేపట్టారు. దీంతో పట్టణ శివారులో ఉన్న దుర్గానగర్, దుర్గాకాలనీ తదితర ప్రాంతాల్లో ఇళ్ల గోడలు బీటలు వారుతున్నాయని పలువురు కాలనీవాసులు టీడీపీ నాయకుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో గురువారం టీడీపీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబుతోపాటు తహసీల్దారు జి.సత్యనారాయణ తదితరులు పట్టణంలో దుర్గానగర్, దుర్గాకాలనీ తదితర ప్రాంతాల్లో పర్యటించి ఇళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా పెదిరెడ్డి చిట్టిబాబు మాట్లాడుతూ కొండను బద్దలు కొట్టడం కోసం చేపడుతున్న బాంబు పేలుళ్ల తీవ్రతను తగ్గించేలా కాంట్రాక్టర్‌ను ఆదేశించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు ఎం.రమాకుమారి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ



శిక్షణ పొందుతున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

ఎలమంచిలి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కార్యకర్తలంతా శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని స్థానిక సీడీపీవో ఇందిర సూచించారు. గురువారం పులపర్తి జడ్పీ హైస్కూల్‌లో అంగన్‌వాడీ కార్యకర్తలకు తొలివిడత మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. పోషణ్ బీ పఢాయి బీ కార్యక్రమంపై ఇస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాంబిల్లిలో..

మండలంలోని కొత్తూరు జడ్పీ హైస్కూల్లో గురువారం అంగన్‌వాడీ కార్యకర్తలకు పోషణ్ బీ పఢాయి బీ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు ఎస్‌పీఎస్ రాణి, మాలతీదేవి కార్యక్రమం అవశ్యకతపై శిక్షణ ఇచ్చారు. 0 టూ 6 సంవత్సరాలు గల పిల్లలకు పోషణ, పూర్వ ప్రాథమిక విద్యపై శిక్షణ, పుట్టిన పిల్లలకు తల్లి పాలు ఇవ్వడం వలన కలిగే ప్రయోజనాలు, వ్యక్తిగత పరిశుభ్రత, 1,2,3 తరగతులలో చదవడం, రాయడం, గణితం, తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సాగు నీటి కాలువ గేట్లు ఆధునికీకరణ



తులసీనగర్ సమీపంలో కాలువ గేట్లు పనులు జరుగుతున్న దృశ్యం

ఎలమంచిలి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తులసీనగర్ సమీపంలో ఉన్న సాగునీటి కాలువ గేట్లు ఆధునికీకరణ పనులు జోరుగా జరుగుతున్నాయి. ఏషియన్ పెయింట్స్ సీఎస్‌ఆర్ నిధులతో సాగునీటి కాలువపై ఉన్న రెండు గేట్లను ఆధునికరిస్తున్నామని ఇరిగేషన్ ఏఈ రామకృష్ణ తెలిపారు. ఈ పనులు పూర్తయితే ఆయకట్టు భూములకు పుష్కలంగా సాగునీరు అందుతుందన్నారు.

దిబ్బపాలెంలో నిరుపయోగంగా బస్‌షెల్టరు



దిబ్బపాలెం బస్‌షెల్టరు ఇదే

అచ్యుతాపురం రూరల్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): దిబ్బపాలెం మెయిన్ రోడ్డులో గల బస్‌షెల్టరు నిరుపయోగంగా మారింది. వెంకటాపురం నుంచి రాంబిల్లి వెళ్లే ప్రధాన రహదారిలో దిబ్బపాలెం వద్ద మెయిన్‌రోడ్డుకు అనుకుని బస్ షెల్టర్‌ను నిర్మించారు. సుమారు 25 గ్రామాలకు ఇదొక్కటే బస్సుల కోసం వేచి ఉండే ప్రదేశం. గ్రామానికి దూరంగా ఉండడంతో ప్రజలు బస్‌షెల్టరు వద్దకు వెళ్లడం మానేశారు. దీంతో ఈ షెల్టరు అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది. వాహనాల కోసం ఎదురు చూసే వారు గ్రామానికి దగ్గరలో గల షాపులను ఆశ్రయిస్తున్నారు తప్ప బస్‌షెల్టరును ఉపయోగించడం లేదు. అనుకూలమైన ప్రదేశంలో మరో బస్‌షెల్టరును నిర్మించాలని పలువురు కోరుతున్నారు.

‘పేట’ పంచాయతీకి కొత్త వాహనాల కొనుగోలు

- ఈవోపీఆర్డీ సీహెచ్ చంద్రశేఖర్

పాయకరావుపేట, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): పాయకరావుపేట పంచాయతీలో చెత్త తరలించే మినీ వాహనాలు పూర్తిగా పాడైనందున వాటి స్థానంలో కొత్త వాహనాలను కొనుగోలు చేయనున్నామని ఈవోపీఆర్డీ సీహెచ్.చంద్రశేఖర్ తెలిపారు. గురువారం ‘మూలకు చేరిన పంచాయతీ వాహనాలు’ శీర్షికన ప్రచురితమైన కథనంపై ఆయన స్పందించారు. పట్టణంలో రోజూ చెత్తను తరలించేందుకు ప్రస్తుతం మూడు ట్రాక్టర్లు, ఆరు రిక్షాలు ఉన్నాయన్నారు. మూడు ట్రాక్టర్లలో రెండింటి తొట్టెల తలుపులు పోయినందున వీటికి త్వరలో మరమ్మతులు చేపట్టి పూర్తిస్థాయి వినియోగంలోకి తేనున్నామన్నారు. అదేవిధంగా నాలుగు మినీ వాహనాలు పూర్తిగా పాడైనందున వాటిని విక్రయించి, కొత్తవి కొనుగోలుకు అవసరమైన బడ్జెట్ కేటాయింపుల కోసం పంచాయతీ తీర్మానం చేసి ఉన్నతాధికారులకు పంపుతామని ఆయన తెలిపారు.

ఘనంగా 33వ సప్తాహ మహోత్సవం



పాతసత్యవరంలో సప్తాహ కార్యక్రమంలో భజన చేస్తున్న దృశ్యం

పాయకరావుపేట రూరల్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సత్యవరం గ్రామంలోని పాతసత్యవరం లక్ష్మీగణపతి ఆలయంలో 33వ సప్తాహ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని గ్రామస్థుల సహాయ సహకారాలతో 33 సంవత్సరాలుగా నిర్వహిస్తున్నట్టు గ్రామ పెద్దలు, కమిటీ సభ్యులు తెలిపారు. సప్తాహం నిర్వహించే వారం రోజులు పగలు, రాత్రులు నిర్విరామంగా భజనలు చేస్తారు. మండలంలోని వివిధ గ్రామా లకు చెందిన భజన సంఘాల సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారు. సప్తాహం ముగింపు రోజున అన్న సమారాధన నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలియజేశారు.

‘చినపూడి, దుప్పితూరు గ్రామాలను తరలించాలి’

అచ్యుతాపురం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చినపూడి, దుప్పితూరు గ్రామాలను సెజ్ పరిధి నుంచి తరలించి పునరావాసం కల్పించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రొంగలి రాము డిమాండ్ చేశారు. సీపీఎం ప్రజా చైతన్య యాత్రలో భాగంగా గురువారం ఈ గ్రామాల్లో ఆయన పర్యటించి, ప్రజాసమస్యలను గుర్తించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చినపూడి, దుప్పితూరు గ్రామాలను తరలింపు జాబితాలో చేర్చినా ఇంతవరకు తరలించలేదు. ఈ రెండు గ్రామాలను వెంటనే తరలించి పునరావాసం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కె. సోమునాయుడు, సూరి అప్పారావు, అప్పల రాజు, ఉష, అచ్చెమ్మ, అప్పారావు పాల్గొన్నారు.

‘బాలల సంక్షేమానికి అంతా కృషిచేయాలి’



సమావేశంలో మాట్లాడుతున్న సామాజిక కార్యకర్త రమ్య

అచ్యుతాపురం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): బాలల సంక్షేమానికి అంతా కృషిచేయాలని క్షేత్రస్థాయి సామాజిక కార్యకర్త ఎల్‌వీ రమ్య అన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలు మేరకు గురువారం వెదురువాడ, గొర్లె ధర్మవరం, వైఎస్సార్ నగర్, మార్టూరు పంచాయతీల్లో విలేజ్ చైల్డ్ వెల్ఫేర్ ప్రొటెక్షన్ కమిటీలను ఆమె నియమించారు. బాల్యవివాహాలు జరగకుండా చూడాలని కమిటీ సభ్యులకు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామాల్లో కమిటీలు చేయాల్సిన విధి విధానాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు గొర్లె నూకరాజు, కేకే రమేశ్ బాబు, కొయ్య శ్రీనివాసరావు, లాలం వాసు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సంఘం నిధులతో సీసీ రోడ్డు

- మూలపేట సర్పంచ్ భీశెట్టి గంగ అప్పలనాయుడు



మూలపేటలో సీసీ రోడ్డు పనులకు భూమిపూజ చేసిన దృశ్యం

మునగపాక, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మూలపేటలో 15వ ఆర్థిక సంఘం నిధులతో సిమెంట్ రోడ్డు నిర్మాణానికి గురువారం సర్పంచ్ భీశెట్టి గంగ అప్పలనాయుడు భూమి పూజ చేశారు. ఇటీవల గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు చేపట్టామని సర్పంచ్ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు కాండ్రేగుల వెంకటలక్ష్మి, ఉపసర్పంచ్ మొల్లేటి దేవి, చంద్ర, వార్డు సభ్యులు, కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

తులసీనగర్‌కు తీరిన లోఓల్టేజి సమస్య



తులసీనగర్‌లో ఏర్పాటు చేస్తున్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు పనులను పరిశీలిస్తున్న మునిసిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి

ఎలమంచిలి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఎలమంచిలి తులసీనగర్‌లో గురువారం నూతన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయడంతో లోఓల్టేజి సమస్య తీరిందని చైర్‌పర్సన్ రమాకుమారి అన్నారు. త కొంతకాలంగా లోఓల్టేజీతో స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యేవారని, సమస్యను విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లడంతో ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటుచేశారన్నారు. కార్యక్రమంలో విద్యుత్ సిబ్బంది ఆదినారాయణ,స్థానికులు పాల్గొన్నారు.

ఘనంగా ముత్యమాంబ బ్రాహ్మణి అమ్మవారి పండగ



నునపర్తిలో అన్నసమారాదన జరుగుతున్న దృశ్యం

అచ్యుతాపురం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నునపర్తిలో ముత్యమాంబ బ్రాహ్మణి అమ్మవారి పండగ గురువారం ఘనంగా జరిగింది. ఉదయం నుంచి అమ్మవారికి పూజలు నిర్వహించారు. పసుపు, కుంకుమ, చీర, జాకెట్లు సమర్పించారు. మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రెడ్డి నగేశ్, దేముడమ్మ, పోతనాయుడు, కోటేశ్వరరావు, ముత్యమాంబ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

తుమ్మపాలలో మురుగు తాండవం

▸ మేజర్ పంచాయతీలో అస్తవ్యస్తంగా మారిన డ్రైనేజీ వ్యవస్థ
▸ చినబాబు కాలనీతో పాటు చాలా చోట్ల రోడ్లపై వాడుక నీరు ప్రవాహం
▸ ఓ వైపు దుర్వాసన.., మరో వైపు దోమల బెడదతో నివాసితులకు అవస్థలు


ఎన్టీఆర్ మార్గ్‌లో..


లాల్‌బహదూర్‌శాస్త్రి మార్గ్‌లో మురుగు తిష్ఠ


మెయిన్‌రోడ్డు పక్కన..

తుమ్మపాల, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి మండలంలోని మేజర్ పంచాయతీ తుమ్మపాల వాసులను మురుగు సమస్య వెంటాడుతోంది. పలుచోట్ల రోడ్లపై ప్రవహిస్తుండడంతో ఆయా ప్రాంతాల వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారడంతో ఈ పరిస్థితి తలెత్తిందని అంతా వాపోతున్నారు. ఇక్కడ మెయిన్ రోడ్డును ఆనుకొని ఉన్న చినబాబు కాలనీలోని పలు వీధుల్లో ఎటు చూసినా మురుగే దర్శనమిస్తోంది. పలుచోట్ల డ్రైనేజీలు శిథిలావస్థకు చేరుకోవడంతో ఇళ్లలో వాడుక నీరు రోడ్లపైకి చేరి రోజుల తరబడి నిలిచిపోతోంది. మరికొన్ని వీధుల్లో అసలు కాలువలే లేకపోవడంతో వాడుక నీటిని కొందరు వీధుల్లోకి విడిచిపెడుతున్నారు. ఫలితంగా సీసీ రోడ్లు అధ్వానంగా మారుతున్నాయి. ఇది మురుగుగా మారి రోజుల తరబడి తిష్ఠ వేస్తుండడంతో ఓ వైపు దుర్వాసన, మరో వైపు దోమల బెడదతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆయా ప్రాంతాల ప్రజలు వాపోతున్నారు. మెయిన్ రోడ్డుకు ఆనుకొని ఉన్న జవహర్‌లాల్ నెహ్రూ మార్గ్, లాల్‌బహదూర్ శాస్త్రి మార్గ్, ఎన్టీఆర్ మార్గ్ తదితర వీధుల్లోని ప్రజలు మురుగు సమస్యతో సతమతమవుతున్నారు. ఇటుగా రాకపోకలు సాగించే వారితో పాటు ఆప్రాంతాల వాసులు అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఈ సమస్యపై ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించాల్సిందిగా తుమ్మపాలకు చెందిన చదరం నాగేష్, చినబాబుకాలనీకి చెందిన సీహెచ్.ఆదిలతో పాటు అంతా కోరుతున్నారు.

ఓటరు జాబితాలో అభ్యంతరాలు ఉంటే తెలపండి

▸ వివిధ పార్టీల నేతలకు డీఆర్‌వో సత్యనారాయణరావు సూచన


రాజకీయ పార్టీల నాయకులతో మాట్లాడుతున్న డీఆర్‌వో సత్యనారాయణరావు

అనకాపల్లి కలెక్టరేట్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : ఓటరు జాబితాలో అభ్యంతరాలు ఉంటే బూత్ లెవెల్ అధికారి, ఎన్నికల అధికారి, సహాయ ఎన్నికల అధికారిలో ఎవరికో ఒకరికి తెలియజేయాలని రాజకీయ పార్టీల ప్రతినిధులకు జిల్లా రెవెన్యూ అధికారి వై.సత్యనారాయణరావు సూచించారు. గురువారం ఇక్కడ వివిధ రాజకీయ పార్టీల నేతలతో ఆయన ఓటరు జాబితాల సవరణలో భాగంగా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఓటరు జాబితాలో అసెంబ్లీ స్థాయిలో పరిష్కారం కాని సమస్యలు, అభ్యంతరాలు ఉన్నా, ఓటరు జాబితాలో ఎవరైనా అనర్హులు ఉన్నా సదరు అధికారుల దృష్టికి తీసుకురావాలని వివరించారు. ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు నిరంతర ప్రక్రియని, రాజకీయ పార్టీల ప్రతినిధులు జాబితాను ఎప్పటికప్పుడు పరిశీలించుకోవాలని సూచించారు. ఓటరు జాబితాలోని సమస్యలు ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకువెళ్లాలనే లక్ష్యంతోనే ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నామని చెప్పారు. బూత్‌స్థాయి అధికారుల నియామకం, ఓటరు జాబితాలను పక్కాగా తయారు చేసేందుకు, మరింత మంది బూత్‌స్థాయి అధికారులు, ఎలక్టోరల్ అధికారుల నియామకానికి ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. అలాగే పక్కా ఓటర్ల జాబితా తయారీకి అన్ని రాజకీయ పార్టీల నేతలు సహకరించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ ఎస్ఎస్‌వీ నాయుడుతో పాటు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

కలపాక- దేవాడ రహదారి విస్తరణకు వినతి


చైర్మన్ ప్రగడకు వినతి పత్రాన్ని అందిస్తున్న బీజేపీ నేత బండారు రాజశేఖర్ తదితరులు

పరవాడ, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : జాజులవానిపాలెం నుంచి కలపాక మీదుగా దేవాడ గ్రామానికి వెళ్లే రహదారి విస్తరణ చేపట్టాలని మండలంలోని పి.బోనంగికి చెందిన బీజేపీ నాయకుడు బండారు రాజశేఖర్ కోరారు. ఈ మేరకు గురువారం రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావును కలిసి వినతిపత్రం అందజేశారు. సింహాద్రి ఎన్టీపీసీ, హిందూజా పవర్ ప్లాంట్‌లతో పాటు ఏపీ ట్రాన్స్‌కో కార్యాలయానికి వెళ్లే ఉద్యోగులు, కార్మికులతో నిత్యం ఈ రోడ్డు రద్దీగా ఉంటుందని వివరించారు. అలాగే భారీ వాహనాలు, స్కూల్ బస్సుల రాకపోకలతో మరిన్ని ఇబ్బందులు తలెత్తుతున్నట్టు చెప్పారు. ఈ సమస్యలను దృష్టిలో పెట్టుకొని రహదారిని త్వరతగతిన విస్తరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

డిపో ఎదుట ఆర్టీసీ కార్మికులు నిరసన


డిపో ఎదుట నిరసన తెలియజేస్తున్న కార్మికులు

అనకాపల్లి టౌన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా సస్పెండ్ చేసిన డ్రైవర్, కండక్టర్లను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఆర్టీసీ ఎన్ఎంయూఏ ఆధ్వర్యంలో కార్మికులు గురువారం ఆందోళనను ఉధృతం చేశారు. ఇందులో భాగంగా మధ్యాహ్నం డిపో ఎదుట ఎర్ర బ్యాడ్జీలు ధరించి నిరసన తెలియజేశారు. అసోసియేషన్ ప్రతినిధులు పి.సుధాకర్, శంకరరావు తదితరులు మాట్లాడుతూ సమస్యలపై ఇరవై రోజులుగా ఆందోళన చేపడుతున్నా యాజమాన్యం స్పందించకపోవడం తగదన్నారు. 25వ తేదీన చేపట్టనున్న 'చలో డీపీటీవో' కార్యక్రమాన్ని అంతా విజయవంతం చేయాల్సిందిగా పిలుపునిచ్చారు.

'బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం'


సదస్సులో మాట్లాడుతున్న బాలల పరిరక్షణ సమితి ప్రతినిధి లోవరాజు

పరవాడ, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని బాలల పరిరక్షణ సమితి ప్రతినిధి డి.లోవరాజు అన్నారు. పరవాడ పంచాయతీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడారు. పద్దెనిమిదేళ్లు నిండిన బాలికలకే వివాహం చేయాలన్నారు. బాల కార్మికులను పనుల్లో పెట్టరాదన్నారు. అనంతరం పోక్సో, బాల్య వివాహాల నిరోధక చట్టంపై వివరించారు. ఈ సమావేశంలో సర్పంచ్ శిరపురపు అప్పలనాయుడు, ఉప సర్పంచ్ బండారు రామారావు, కార్యదర్శి మురళీధర్ పట్నాయక్, పరవాడ పీహెచ్‌సీ సీహెచ్‌వో సాయిరాం, సచివాలయ సిబ్బంది, ఆశ కార్యకర్తలు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గ్రామ దేవతల వేడుకలు

సబ్బవరం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అంతకాపల్లిలో ముత్యమాంబ మారువారం పండుగ, గొల్లలపాలెంలో దుర్గమాంబ అమ్మవారి అనుపోత్సవం, సబ్బవరం శివారు ఆదిరెడ్డిపాలెంలో పరదేశిమాంబ అమ్మవారి ఆలయ మొదటి వార్షికోత్సవం గురువారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా వేకువజాము నుంచి విశేష పూజలు ప్రారంభమయ్యాయి. పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. అంతకాపల్లిలో ముత్యమాంబకు ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు సోదరుడు వెంకటేశ్వరరావుకు పూజలు జరిపారు. ఈ కార్యక్రమాల్లో ఆయా గ్రామాల పెద్దలు చొక్కాకుల వెంకటరావు, ఎస్‌టీ రామకాసు, కొటాన రాము, అప్పారావు, ఎం .మహాలక్ష్మీనాయుడు, రొంగలి దేముడు, బైలపూడి దేముడుబాబు, ఆదిరెడ్డి రమణ, సబ్బవరపు రమణ, నర్శింహమూర్తి, బోకం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ వినియోగదారుల సదస్సు రేపు

అనకాపల్లి టౌన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : గవరపాలెం గౌరీ గ్రంథాలయం 83వ వార్షికోత్సవం సందర్భంగా కన్స్యూమర్ ఆర్గనైజేషన్ ఫెడరేషన్, మండల వినియోగదారుల మండలి సహకారంతో ఈ నెల 22వ తేదీన గౌరీ గ్రంథాలయంలో విద్యుత్ వినియోగదారుల సదస్సు నిర్వహిస్తున్నట్టు సమన్వయకర్త శరగడం శ్రీనివాసరావు తెలిపారు. ఉదయం పది గంటలకు ప్రారంభం కానున్న ఈ సదస్సుకు ఈపీడీసీఎల్ సీజీఆర్ఎఫ్ చైర్‌పర్సన్, విశ్రాంత న్యాయమూర్తి బి.సత్యనారాయణ, ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ రెగ్యులారిటీ కమిషన్ రాష్ట్ర సలహా కమిటీ సభ్యులు కాండ్రేగుల వెంకటరమణ హాజరు కానున్నారన్నారు. విద్యుత్‌కు సంబంధించిన సమస్యలను వినియోగదారులు పరిష్కరించుకోవాల్సిందిగా ఆయన కోరారు.

ట్రాన్స్‌జెండర్ దీపు హత్య కేసు నిందితుడ్ని కఠినంగా శిక్షించాలి

▸ అనకాపల్లిలో తోటి ట్రాన్స్‌జెండర్లు భారీ ఆందోళన
▸ వివిధ జిల్లాల నుంచి తరలి రావడంతో ట్రాఫిక్‌కు అంతరాయం


నినాదాలు చేస్తూ ట్రాన్స్‌జెండర్ల నిరసన ప్రదర్శన

అనకాపల్లి టౌన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : ట్రాన్స్‌జెండర్ దీపు హత్య కేసులో నిందితుడ్ని కఠినంగా శిక్షించాలంటూ గురువారం తోటి ట్రాన్స్‌జెండర్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలో నిరసన ప్రదర్శన నిర్వహించి, నెహ్రూచౌక్‌లో మానవహారంగా ఏర్పడ్డారు. హత్యకు గురైన దీపు కుటుంబానికి న్యాయం చేయాలంటూ నినాదాలు చేశారు. దీపును హతమార్చిన నిందితుడికి ఉరిశిక్ష వేయాలని డిమాండ్ చేశారు. ఈ ఆందోళనతో ట్రాఫిక్‌కు కొంతసేపు అంతరాయం ఏర్పడింది. అంతకు ముందు డీఎస్పీ కార్యాలయానికి అంతా చేరుకుని డీఎస్పీతో మాట్లాడారు. నిందితుడిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని డీఎస్పీ వారికి స్పష్టం చేశారు. ఈ ఆందోళన కార్యక్రమానికి వివిధ జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో ట్రాన్స్‌జెండర్లు తరలి వచ్చారు. అనంతరం ఎన్టీఆర్ వైద్యాలయం నుంచి మృతదేహాన్ని చింతావారి వీధి, మెయిన్‌రోడ్డు, దానరిగెడ్డ రోడ్డు, అంబేడ్కర్‌నగర్, సంతబయలు మీదుగా ఊరేగింపుగా తీసుకు వెళ్లి సంతబయలు శ్మశానవాటికలో దహన సంస్కారాలు పూర్తి చేశారు.

మీటర్ రీడర్లకు ప్రత్యామ్నాయం చూపండి

▸ స్మార్ట్ మీటర్ల ఏర్పాటుతో వీధినపడే ప్రమాదం
▸ ఈపీడీసీఎల్ కార్యాలయం ఎదుట ఆందోళన


ఈపీడీసీఎల్ కార్యాలయం వద్ద నిరసన తెలియజేస్తున్న మీటర్ రీడర్లు

అనకాపల్లి టౌన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న మీటర్ రీడర్లకు ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలని కోరుతూ గురువారం వారంతా ఇక్కడి ఈపీడీసీఎల్ కార్యాలయం ఎదుట నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంస్థనే నమ్ముకుని సుమారు పదిహేను సంవత్సరాలుగా పని చేస్తున్నామన్నారు. స్మార్ట్ మీటర్లు వస్తున్న తరుణంలో మీటర్ రీడర్లు ఉపాధి కోల్పోయి రోడ్డున పడే పరిస్థితి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అలా జరగకుండా సంస్థలోనే ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలని ఈపీడీసీఎల్ ఎస్ఈ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. తమకు ఉద్యోగభద్రత కల్పించడంతో పాటు కనీస వేతనాలు అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మీటర్ రీడర్స్ అసోసియేషన్ ప్రతినిధులు పి.శంకరరావు, కార్యదర్శి బి.శ్రీనివాసరావు తదితరులతో పాటు నర్సీపట్నం, ఎలమంచిలి, కొరుప్రోలు, అనకాపల్లి, పాయకరావుపేట ప్రాంతాలకు చెందిన మీటర్ రీడర్లు పాల్గొన్నారు.

నోటి పరిశుభ్రతతో వ్యాధులు దూరం


అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థినులు, ఉపాధ్యాయులు

కశింకోట, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : తాళ్లపాలెం అంబేడ్కర్ గురుకులం పాఠశాలలో గురువారం ప్రపంచ నోటి పరిశుభ్రత దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ ప్రధాన వైద్యాధికారిణి డాక్టర్ ఎ.మనీషా మాట్లాడుతూ నోటి క్యాన్సర్ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పొగాకు, ఖైనీ, గుట్కా, పాన్‌పరాగ్ వంటి హానికరమైన పదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాలను తెలియజేశారు. ఆరోగ్య బోధకుడు ఎం.ఎస్.వి.ప్రసాద్ నోటి పరిశుభ్రత గురించి అవగాహన కల్పించారు. రోజుకు రెండుసార్లు బ్రష్ చేయాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో అవగాహన ర్యాలీ జరిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జి.గ్రేస్ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్లలో ఆశీల వసూల వేలం వాయిదా

అనకాపల్లి టౌన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : ఆశీల వసూలుకు సంబంధించి ఇక్కడి జీవీఎంసీ జోనల్ కార్యాలయంలో గురువారం జరిగిన వేలం పాట వాయిదా పడింది. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి వచ్చే ఏడాది మార్చి 31వ తేదీ వరకు అనకాపల్లి జనరల్ మార్కెట్, చేపల మార్కెట్‌లలో ఆశీల వసూళ్లకు ఆర్ఐ పరదేశినాయుడు ఆధ్వర్యంలో వేలం పాటను ప్రారంభించారు. అయితే జనరల్ మార్కెట్ వేలం పాటకు ఒక్కరే రావడం వల్ల వాయిదా వేసినట్టు ఆర్ఐ తెలిపారు. చేపల మార్కెట్ ఆశీల వసూలుకు ఏ ఒక్క కాంట్రాక్టర్ ముందుకు రాలేదన్నారు.మళ్లీ ఆశీల వసూలుకు వేలం పాట ఎప్పుడు నిర్వహించేది తేదీని ఖారు చేశాక వెల్లడిస్తామని ఆయన వివరించారు.

ల్యాండ్ పూలింగ్ బాధితులకు ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేయాలి

▸ సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు లోకనాథం డిమాండ్


కుంచంగిలో ల్యాండ్ పూలింగ్ భూములను పరిశీలిస్తున్న సీపీఎం నేతలు

కొత్తూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి మండలం కుంచంగి, కూండ్రం, రొంగలివానిపాలెం గ్రామాల్లో ల్యాండ్ పూలింగ్ బాధితుల నుంచి సేకరించిన భూమిపై వెంటనే విచారణ జరిపి, వారికి కేటాయించిన ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కె.లోకనాథం డిమాండ్ చేశారు. గురువారం ఆ పార్టీ మండల కన్వీనర్ గంటా శ్రీరామ్, జిల్లా కమిటీ సభ్యులు అల్లురాజు, బి.ఉమామహేశ్వరరావు తదితరులు సదరు ప్లాట్లను పరిశీలించారు. సీఐడీ దర్యాప్తు పేరుతో అధికారులు లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ చేయకుండా గత రెండేళ్లు రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిప్పుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏడాదికి రూ.60 వేల నుంచి రూ.రెండు లక్షల వరకు జీడితోటల ద్వారా వచ్చేదన్నారు. ఈ జీడి తోటలను కూలగొట్టడం వల్ల తీవ్రంగా నష్టపోయారన్నారు. మామిడిపాలెం, కోడూరు, కొండుపాలెం, సంతపాలెం గ్రామాల్లోనూ ఇదే పరిస్థితి ఉందని వివరించారు. తక్షణమే ల్యాండ్ పూలింగ్ లబ్ధిదారులను రెవెన్యూ అధికారులు గుర్తించి రిజిస్ట్రేషన్ చేయాలని కోరారు. లేనిపక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. పార్టీ నాయకులు త్రిమూర్తులు, పి.మురళీ, పి.శాంతి కుమారి, బి.జాన్సన్ పాల్గొన్నారు.

గొర్లివానిపాలెంలో అగ్ని ప్రమాదం

▸ మూడు పశువుల పాకలు, గడ్డివాము దగ్ధం
▸ మూడు ఎకరాల్లో సరుగుడు, మామిడి తోటలకు నష్టం
▸ ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు వేడుకోలు


ప్రమాదంలో కాలి బూడిదైన పశువులు పాకలు


85 వార్డు పరిధి శ్రీరామ్‌నగర్ కాలనీ సమీపంలో ఎగసి పడుతున్న మంటలు

సబ్బవరం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం సబ్బవరం శివారు గొర్లివానిపాలెంలో గురువారం జరిగిన అగ్ని ప్రమాదంలో మూడు పశువుల పాకలు, గడ్డివాము దగ్ధమయ్యాయి. అదే విధంగా సమీపంలో ఉన్న సుమారు మూడు ఎకరాల్లో సరుగుడు, మామిడి తోటలకు నిప్పంటుకుని నష్టం వాటిల్లింది. ఇందుకు సంబంధించి గ్రామస్థులు తెలిపిన వివరాలివి. గ్రామ సమీపంలో గురువారం ఉదయం కల్లాల వద్ద పశువును కట్టేసి, గడ్డి వేసి రైతులు ఇళ్లకు వెళ్లిపోయారు. అనంతరం కొంత సేపటికి కల్లాల వద్ద నుంచి పొగరావడం స్థానికులు గుర్తించి పరుగులు తీశారు. వెంటనే అగ్నిమాపక శాఖ అధికారి చిరంజీవికి సమాచారం అందించడంతో ఆయన సిబ్బందితో వచ్చి మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో గొర్లి అప్పలనాయుడుకు చెందిన గడ్డివాము, పశువుల పాక, గొర్లి సత్యనారాయణ, గొర్లి నర్శింహమూర్తికి చెందిన రెండు పశువుల పాకలు కాలి బూడిదయ్యాయి. సమీపంలో గల సరుగుడు, మామిడి తోటల్లో గల ఆకులు కాలుతూ పాకలకు నిప్పు అంటుకున్నట్టు రైతులు చెబుతున్నారు. ఆకతాయిలు సిగిరెట్టు వెలిగించే క్రమంలో ఈ ఘటన జరిగి ఉంటుందని అభిప్రాయపడుతున్నారు. ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాల్సిందిగా బాధితులు కోరుతున్నారు. బాధితులను ఎంపీటీసీ గొర్లి చైతన్య, టీడీపీ నేత గండి దేముడు, గ్రామ పెద్దలు గొర్లి అచ్చింనాయుడు, బాదిరెడ్డి లక్ష్మణ తదితరులు పరామర్శించారు.

లంకెలపాలెం : జీవీఎంసీ 85వ వార్డు పరిధి శ్రీరామ్‌నగర్ కాలనీకి సమీపంలో గురువారం మధ్యాహ్నం అగ్ని ప్రమాదం సంభవించింది. నివాసాలను ఆనుకొని ఖాళీగా ఉన్న ప్రదేశంలో ఏపుగా పెరిగిన ముళ్ల పొదలకు మంటలు వ్యాపించాయి. బలమైన గాలులు వీయడంతో పెద్ద ఎత్తున మంటలు ఎగసి పడ్డాయి. నివాసితులు భయాందోళనతో పరుగులు తీశారు. స్థానికులు ఫార్మాసిటీలో గల రాంకీ అగ్నిమాపక శకటానికి సమాచారం అందించడంతో వారు వచ్చి మంటలను అదుపు చేశారు. సిగరెట్ కాల్చి పడేయడం కారణమై ఉంటుందని అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

పిచ్చుకల సంరక్షణ అందరి బాధ్యత


పిచ్చుకలకు గూడు ఏర్పాటు చేస్తున్న ప్రిన్సిపాల్

సబ్బవరం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : విశ్వంలో పిచ్చుకలు మానవ మనుగడకు ఆధారం అని ఇక్కడి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సీతాలక్ష్మి అన్నారు. కళాశాలలో గురువారం అంతర్జాతీయ పిచ్చుకల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిచ్చుకలు మానవాళికి మేలు చేసే చిరు ప్రాణులన్నారు. అటువంటి వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిదిగా పేర్కొన్నారు. రైతులు తమ పొలాల్లో రసాయనాలు వినియోగించడం వలన అవి అంతరిస్తున్నాయని వాపోయారు. పిచ్చుకల సంరక్షణకు విద్యార్థులు నడుం బిగించాలని పిలుపునిచ్చారు. అనంతరం కళాశాల ఆవరణలో పిచ్చుకుల గూడును అమర్చారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.శంకర్, అధ్యాపకలు ఎం. గోవిందరావు, గణేశ్, లక్ష్మి, గోపాలకృష్ణ, రామకృష్ణ, రత్నప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

టైలరింగ్‌తో మహిళలకు స్వయం ఉపాధి


మహిళలకు సర్టిఫికెట్లు అందిస్తున్న శ్రీకాంత్ తదితరులు

పరవాడ, మార్చి20 (ఆంధ్రజ్యోతి) : టైలరింగ్ వృత్తి ద్వారా మహిళలు స్వయం ఉపాధి పొందవచ్చని రాంకీ ఫౌండేషన్ డిప్యూటీ హెడ్ కె.శ్రీకాంత్ అన్నారు. ఫౌండేషన్ సౌజన్యంతో సాధన స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆరు నెలల పాటు మహిళలకు ఇక్కడ కుట్టు శిక్షణ ఇచ్చారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి గురువారం శ్రీకాంత్ సర్టిఫికెట్లను అందజేసి మాట్లాడారు. మహిళలు ఇంటి వద్ద టైలరింగ్ చేసుకుంటూ కుటుంబానికి ఆసరాగా ఉండవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు పైలా గోపాలకృష్ణ, షేక్ఇస్మాయిల్, శిక్షకురాలు లక్ష్మి, సాధన సిబ్బంది డి.నాగమణి, కేబీ కన్నారావు తదితరులు పాల్గొన్నారు.

హీరో శోభన్‌బాబుకు నివాళులు


శోభన్‌బాబు చిత్రపటం వద్ద అభిమానుల నివాళి

అనకాపల్లి టౌన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ సినీ హీరో శోభన్‌బాబు 17వ వర్ధంతిని గురువారం ఇక్కడి విజయరామరాజుపేటలో నిర్వహించారు. శోభన్‌బాబు ఫ్యాన్స్ అసోసియేషన్ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు ముగడ అప్పారావు ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి ఆ ప్రాంత పెద్దలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్య క్రమంలో పలకా రాము, పలకా సత్యనారాయణ, పిట్ల బుడ్డేశ్వరరావు, బొబ్బిలి అప్పారావు, బొబ్బిలి గోవింద, ఒమ్మి రాము, ఈ. సత్యఅప్పారావు, అప్పికొండ ప్రసాద్, విత్తనాల పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఆరోగ్య సూత్రాలు పాటించాలి


సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ విద్యాధరి

సబ్బవరం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు ఆరోగ్యంపై అవగాహన కలిగి ఉండాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ విద్యాధరి అన్నారు. వరల్డ్ హెల్త్ డేను పురస్కరించుకుని ఇక్కడి గురుకుల విద్యాలయం విద్యార్థులకు గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ఆరోగ్య సూత్రాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎన్.రామకృష్ణ, డాక్టర్ సురేష్, డాక్టర్ కన్ననాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయుడి ఔదార్యం

» సొంత నిధులతో పాఠశాల చుట్టూ కంచె ఏర్పాటు



కొత్త పాడి పాఠశాల చుట్టూ వేసిన ఫెన్సింగ్

కొయ్యూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): పాఠశాల పరిసరాల్లో పశువులు, ఆకతాయిల బారి నుంచి రక్షణగా చుట్టూ కంచె ఏర్పాటు చేసి ఆ హెచ్‌ఎం ఔదార్యాన్ని చాటుకున్నారు. మండలంలో కొండగోకిరి పంచాయతీ పరిధి కొత్తపాడి ఎంపీ ప్రాథమిక పాఠశాలకు ప్రహరీ లేక నిత్యం ఇబ్బందులు ప డుతున్నారు. పశువులులోనికి రావడం, రాత్రి వేళలో ఆకతాయిలు వల్ల పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయి. దీనిని గుర్తించిన పాఠశాల హె చ్‌ఎం మహేశ్ తన సొంత నిధులతో పాఠశాల చుట్టూ సిమెంట్ స్తంభాలు వేసి వాటికి ఇనుప గ్రిల్ ను అమర్చి గేటు ఏర్పాటు చేసి పాఠశాలకు రక్షణ కల్పించారు. ప్రధానోపాధ్యాయుడి చూపిన చొరవకు పలువురు గ్రామస్థులు ప్రశంసించారు.

టీడీపీ కేంద్ర కార్యాలయ గ్రీవెన్స్‌లో జీసీసీ చైర్మన్



అర్జీదారుని సమస్యను అడిగి తెలుసుకుంటున్న జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్

పాడేరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మంగళగిరిలో తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో గురువారం నిర్వహించిన గ్రీవెన్స్ కార్యక్రమంలో ఆ పార్టీ అరకులోయ పార్లమెంటరీ అధ్యక్షుడు, జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాలనుంచి వచ్చిన ప్రజలనుంచి అర్జీలను స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మంత్రులు, పార్టీ పెద్దలు పాల్గొనే టీడీపీ కేంద్రం కార్యాలయంలోని గ్రీవెన్స్ కార్యక్రమంలో తనకు భాగస్వామ్యం కల్పించడంపై శ్రావణ్‌కుమార్ ఆనందం వ్యక్తం చేశారు. ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని జీసీసీ చైర్మన్ ఈసందర్భంగా అన్నారు.

ఉపాధి హామీ పనులు కల్పించాలి



దుప్పులవాడలో ఉపాధి పనులు కల్పించాలని కోరుతున్న గిరిజనులు

సీలేరు, మార్చి 20 , (ఆంధ్రజ్యోతి): జీకేవీధి మండలం దుప్పులవాడ పంచాయతీలో ఉపాధి హామీ పనులను కల్పించాలని గిరిజనులు కోరారు. పంచాయతీలో మూడు రోజు మాత్రమే ఉపాధి హామీ పనులను చేయించి నిలిపివేశారని వాపోతున్నారు. దీంతో దుప్పులవాడ నుంచి 150 మంది భద్రాచలం ప్రాంతానికి మిర్చి కోతలకు, ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిపోయారన్నారు. ఈ నేపథ్యంలో సంబంధిత అధికారులు స్పందించి తమకు ఉపాధి హామీ పనులు కల్పించి ఆదుకోవాలని గ్రామస్థులు కె రాంబాబు, ఎం నాగేశ్వరరావు, కేలేబు లక్ష్మి, ఎం విజయలక్ష్మి తదితరులు కోరారు.

1 నుంచి రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నీ

పాడేరురూరల్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): పాడేరు మోదకొండమ్మ జాతర సందర్భంగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో ఏప్రిల్ 1వ తేదీ నుంచి రాష్ట్ర స్థాయి మెగా క్రికెట్ టోర్నీ నిర్వహించనున్నట్టు నిర్వాహకులు కొంటా దుర్గారావు, సీదరి రాంబాబు, బాకూరు మహేశ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. టోర్నీలో గెలుపొందిన జట్లకు ప్రథమ బహుమతి రూ. 1.20 లక్షలు, షీల్డ్, ద్వితీయ బహుమతి రూ. 60 వేలు, షీల్డ్, బెస్ట్ టీమ్‌కు రూ. 20 వేలు షీల్డ్, మ్యాన్ ఆఫ్ ద సిరీస్‌కు రూ. 15 వేలు షీల్డ్‌తో పాటు క్రీడాకారుల వ్యక్తిగత ప్రతిభ ఆధారంగా రూ. 5 వేలు, మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ షీల్డ్ అందజేస్తామన్నారు. టోర్నీలో పాల్గొనే క్రికెట్ జట్లు ఈ నెల 26వ తేదీ బుధవారంలోగా రూ. 3 వేలు ప్రవేశ రుసుం చెల్లించి నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్: 89198 54104, 63026 94492 నంబర్లకు సంప్రదించాలన్నారు.

పిల్లల ఎదుగుదలకు 'నవచేతన'



శిక్షణలో మాట్లాడుతున్న సీడీపీవో సువర్ణమ్మ

జి.మాడుగుల, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మూడేళ్లలోపు పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలకు అంగన్‌వాడీలు కృషి చేయాలని సీడీపీవో సువర్ణమ్మ సూచించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పోషణ బీ పడాయిబీ (పీబీపీబీ) నవచేతన, ఆదర్శశీల కార్యక్రమంలో భాగంగా గురువారం మండల అంగన్‌వాడీలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మూడునుంచి ఆరు సంవత్సరాల పిల్లలకు ప్రీస్కూల్ విద్యనందించాలని కోరారు. అలాగే గ్రోత్ మానిటరింగ్ తదితర విషయాలు సిబ్బందికి, తల్లిదండ్రులకు వివరించారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్లు వి.సత్యవతి, వి.సుజాత, ఎస్.విజయలక్ష్మి, ఎస్.సత్యవతి, డి.పద్మావతి, ఎం.లక్ష్మి, ఎల్.మణికుమారి, ఎ.కొండమ్మ పాల్గొన్నారు.

ఐటీడీఏ నివాస గృహాలు శిథిలం

» మైదాన ప్రాంతం నుంచి ఉద్యోగులు రాకపోకలు

» పట్టించుకోని అధికారులు



అనంతగిరిలో ఐటీడీఏ నివాస గృహాల దుస్థితి

అనంతగిరి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఐటీడీఏ నివాస గృహాలు శిథిలావస్థకు చేరుకోవడంతో ఉద్యోగులకు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. మౌలికవసతులు లేకపోవడంతో.. మైదాన ప్రాంతాలనుంచి రోజూ విధులకు రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి ఏర్పడింది.. గత ప్రభుత్వం ఉద్యోగుల సంక్షేమంపై చర్యలు చేపట్టకపోవడంతో ప్రస్తుతం పడరానిపాట్లు పడుతున్నారు. మండలంలోని 24 పంచాయతీలకు చెందిన సుమారు 418 గ్రామాల గిరిజనులు తరచూ వివిధ పనులు నిమిత్తం..మండల కేంద్రానికి వస్తుంటారు. ఉద్యోగులు సమయానికి అందుబాటులో లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులను పడాల్సివస్తోంది..

మరమ్మతులతో ఉద్యోగుల కాలక్షేపం

ఉద్యోగుల సౌకర్యార్థం 40 ఏళ్ల క్రితం ఐటీడీఏ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో 25 వరకు నివాస గృహాలను నిర్మించారు. అయితే, ప్రస్తుతం వీటిలో 20 వరకు శిథిలావస్థకు చేరుకున్నాయి. మిగిలిన ఐదు భవనాలు వర్షాలకు కారిపోతుండడంతో ఉద్యోగులు మరమ్మతులు చేయించుకుంటూ కాలాన్ని వెళ్లదీస్తున్నారు. భవనాలు బాగున్న సమయంలో అధికారులు సైతం ఇక్కడ అందుబాటులో ఉంటూ ప్రజలకు సేవలందించేవారు. ఇప్పుడు ఉద్యోగులు మైదాన ప్రాంతాలను నుంచి రాకపోకలు సాగిస్తున్నారు.. జిల్లా అధికారులు స్పందించి, ఉద్యోగులకు మౌలికవసతులతో నివాస గృహాలపై నిర్మిస్తే.. గిరిజనులకు సేవలు చేరువవుతాయని పలువురు అభిప్రాయం వ్యక్తంచేస్తున్నారు.

స్థానిక సంస్థల పాలనపై శిక్షణ: డీపీవో



డి.గొందూరులో నిర్వహించిన వర్క్‌షాపులో పాల్గొన్న సర్పంచి రాంబాబు, ఇతర ప్రతినిధులు

పాడేరురూరల్, మార్చి 20(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల పాలనను బలోపేతం, పంచాయతీ స్థాయిలో స్థిరమైన అభివృద్ధిని ప్రోత్సహించడం లక్ష్యంగా మండలంలోని డి.గొందూరు పంచాయతీ, హుకుంపేట మండలం గడికించుమండ పంచాయతీలలో గురువారం ఒక్కరోజు వర్క్‌షాప్ నిర్వహించినట్టు డీపీవో బి.లవరాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న వంద రోజులకు దార్శనికత, రోడ్ మ్యాప్‌లతో పంచాయతీ ఆకాంక్షలు, అభివృద్ధి ప్రణాళిక, సామర్థ్య నిర్మాణం పట్ల సహకార భాగస్వామ్య విధానాన్ని సులభతరం చేసేందుకు అవగాహన కల్పించినట్టు చెప్పారు. ఈ కార్య క్రమంలో డీఎల్‌పీవో పీఎస్.కుమార్, ఎంపీడీవో తేజరతన్, ఈవోపీఆర్‌ఆర్‌డీ ఆర్‌వీఎస్.రమేశ్, డి.గొందూరు సర్పంచి సీదరి రాంబాబు, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది, జీపీపీఎఫ్‌టీ సభ్యులు, నారాయణరెడ్డి, చైతన్యరెడ్డి పాల్గొన్నారు.

సారా తయారు చేస్తే కఠిన చర్యలు

» ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ శ్రీరామచంద్రమూర్తి



అవగాహన కల్పిస్తున్న డిప్యూటీ కమిషనర్ శ్రీరామచంద్రమూర్తి

పాడేరురూరల్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): గిరిజన గ్రామాల్లో ప్రజలు సారా తయారీ చేసినా, అమ్మకాలు చేపట్టినా కఠిన చర్యలు తప్పవని ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ డి.శ్రీరామచంద్రమూర్తి హెచ్చరించారు. నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని అల్లివర, జోడిమామిడి, కాంద్రంగిపాడు గ్రామాల్లో నిర్వహించిన గ్రామ సభల్లో పాల్గొని ఆయన మాట్లాడారు. సారాకు వ్యతిరేకంగా అ వగాహన కల్పించారు. సారా తాగడం వల్ల కలిగే నష్టాలను వివరించారు. ఆంధ్రప్రదేశ్‌ను సారా రహితంగా తయారు చేసేందుకు ప్రారంభించిన నవోదయం 2.0 కార్యక్రమానికి ప్రతీ ఒక్కరూ సహకరించాలని ఆయన కోరారు. అనంతరం సారా తయారీకి దూరంగా ఉంటామని గ్రామాల ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఇనస్పెక్టర్, ఈఎస్ టాస్క్‌ఫోర్స్ కె.రాజారావు, సిబ్బంది, పంచాయతీ ప్రతినిధులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

పోషకాహారంపై అంగన్‌వాడీలకు శిక్షణ



అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ ఇస్తున్న సీడీపీవో జీవీ రమణ

చింతపల్లి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): పోషకాహారం ప్రాముఖ్యతపై గర్భిణులు, బాలింతలకు అంగన్‌వాడీ కార్యకర్తలు చైతన్యవంతులను చేయాలని స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో జీవీ రమణ అన్నారు. గురువారం స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో 253 మినీ, ప్రధాన అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలకు పోషణ్ బి పడాబి శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలకు మూడు రోజుల పాటు శిక్షణ అందిస్తామన్నారు. ప్రధానంగా గర్భిణులు, బాలింతలకు తక్కువ ఖర్చుతో అధిక పోషకవిలువలు కలిగిన ఆహారాన్ని తీసుకునే పద్ధతులను వివరించాలని కోరారు. చిన్నారులు వయస్సు తగిన బరువు, ఎత్తు ఉన్నదిలేనిది పరిశీలించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందజేస్తున్న పోషకాహారాన్ని గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పూర్తి స్థాయిలో అందించాలన్నారు. ఈకార్యక్రమంలో సూపర్‌వైజర్లు కె. విజయకుమారి, ఎస్కే. గౌహర్ ఉన్నీష, సీహెచ్. సత్యవతి, ఎస్. గౌరి, పి. అప్పలనర్స పాల్గొన్నారు.

ధారాలమ్మ ఉత్సవాలకు శ్రీకారం



ముహూర్తపు రాటను వేస్తున్న ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు, తదితరులు

సీలేరు, మార్చి 20, (ఆంధ్రజ్యోతి) : జీకేవీధి మండలం ధారకొండ ఘాట్ రోడ్డులోని గిరిజనుల ఆరాధ్య దైవం ధారాలమ్మ ఉత్సవాల ముహూర్తపు రాటను గురువారం ఆలయ ప్రాంగణంలో వేశారు. పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు, ఆలయ ఈవో సాంబశివరావు, కూటమి నాయకులు ఆధ్వర్యంలో ఉదయం 8.39 నిమిషాలకు ముహూర్తపు రాటను వేసి ఉత్సవాలకు శ్రీకా రం చుట్టారు. అనంతరం అ మ్మవారి గరగాలంకరణను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారిని గరగలను ఎమ్మెల్యే తలపై పెట్టుకుని ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేశారు. సీలేరుకు చెందిన రజక సంఘం ఆనవాయితీ ప్రకారం అమ్మవారి సన్నిధి లో గరగలను తలపై పెట్టుకుని ఆడారు. వీటిని ధారకొండ, సీలేరు పరిసర గ్రామాల్లో ఊరేగింపుగా తీసుకువెళ్లారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజును సన్మానించి, అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించారు.

14 నుంచి మారెమ్మ ఉత్సవాలు



సమావేశంలో ఉత్సవ కమిటీ సభ్యులు

సీలేరు, మార్చి 20 , (ఆంధ్రజ్యోతి): జీకేవీధి మండలం సీలేరు మారెమ్మ అమ్మవారి 53వ వార్షిక మహోత్సవాల నిర్వహణపై గురువారం ఆలయం ప్రాంగణంలో నిర్వాహకుడు కారే శ్రీనివాస్ ఆధ్వర్యంలో సమావేశమయ్యారు. సీలేరు కాంప్లెక్సు ఏపీ జెన్‌కో సూపరింటెండెంట్ ఇంజనీర్ చంద్రశేఖర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ఉత్సవాల నిర్వహణపై చర్చించారు. ఏప్రిల్ 14న తమిళ సంవత్సరాది రోజున అమ్మవారి జెండా ఆ విష్కరణతో ఉత్సవాలు ప్రారంభం కాగా, 15న అమ్మవారి గరగ అలంకర ణ, అగ్నిగుండం కార్యక్రమం, 25న సామూహిక కుంకుమార్చన, 26న అ మ్మవారి తిరువీధి ఉత్సవం, 27న ప్రధాన పండుగ ఉంటుంది. 28 న చన్నీటి ఉత్సవం, 30న అమ్మవారి మరుపూజ కార్యక్రమం నిర్వహించాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ గౌరవ అధ్య క్షుడిగా జెన్‌కో ఎస్‌ఈ చంద్రశేఖర్‌రెడ్డిని, గౌరవ ఉపాధ్యక్షుడిగా ఏడీఈ టి అప్పలనాయుడుని నియమించారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీని ఏర్పాటు చేశారు.

108లో గిరిజన మహిళ ప్రసవం



వాహనంలో తల్లీ బిడ్డ

అనంతగిరి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): గిరిజన మహిళ 108 వాహనంలో ప్రసవించిన ఘటన చోటుచేసుకుంది. వివరాలివి.. లంగుపర్తి పంచాయతీ మెట్టవలస గ్రామానికి చెందిన మజ్జి ప్రతిమ నిండు గర్భిణి. గురువారం పురిటినొప్పులు ప్రారంభం కావడంతో కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు.. అయితే మెట్టవలస నుంచి లంగుపర్తి పీహెచ్‌సీకి ఆమెను తరలిస్తుండగా.. మార్గమధ్యలోని నొ పులు అధికమవ్వడంతో ఈఎంటీ మౌనిక వైద్యసేవలందించారు. దీంతో 108 వాహనంలోనే ప్రసవించింది.. అనంతరం తల్లీబిడ్డను లంగుపర్తి పీహెచ్‌సీకి తరలించి, మెరుగైన వైద్యసేవలను అందించారు.. తల్లీబిడ్డ ఆరోగ్యవంతంగా ఉన్నారని, సిబ్బంది తెలిపారు.

దుప్పి మాంసంతో పట్టుబడిన ముగ్గురి అరెస్టు

చింతపల్లి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): కొయ్యూరు మండలం సొలబం గ్రామంలో అడవి దుప్పి మాసం విక్రయించేందుకు తరలిస్తున్న ముగ్గురిని అరెస్టు చేసినట్టు పెదవలస రేంజ్ అధికారి యు. శివరంజని తెలిపారు. గురువారం స్థానిక విలేకరులతో ఆమె మాట్లాడుతూ అడవి నుంచి దుప్పి దారితప్పి సొలబం గ్రామ శివారుకి రావడంతో కుక్కలు వెంటపడి దాడి చేశాయన్నారు. గమనించిన గ్రామానికి చెందిన ముగ్గురు గిరిజనులు దుప్పిని హతమార్చి 4.9 కిలోల మాంసాన్ని విక్రయించేందుకు సిద్ధం చేశారన్నారు. విషయం తెలుసుకున్న అటవీశాఖ ఉద్యోగులు దాడిచేసి మాంసాన్ని స్వాధీనం చేసుకుని, ముగ్గురు నిందితులపై కేసు నమోదు చేశామన్నారు. ఈకార్యక్రమంలో ఎఫ్‌ఎస్‌వో నూకరాజు, ఎఫ్‌బీవో గోపి పాల్గొన్నారు.

సకాలంలో సర్వే పూర్తి చేయాలి: జడ్పీ సీఈవో



రాజేంద్రపాలెం సచివాలయంలో సమీక్షిస్తున్న సీఈవో నారాయణమూర్తి

కొయ్యూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిర్దేశించి పీ-4, ఎన్‌పీసీఐ, సిటిజన్ ఈకేవైసీ తదితర సర్వేలు నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలని జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈవో) పి. నారాయణమూర్తి సూచించారు. గురువారం సీఈవో మండలంలో పర్యటించారు. ఇం దులో భాగంగా మండల పరిషత్ కార్యాలయాన్ని సందర్శించారు. రికార్డులు తనిఖీచేసి వాటి నిర్వహణపై అసంతృప్తి అసంతృప్తి వ్యక్తంచేశారు. అనం తరం రాజేంద్రపాలెం సచివాయంను తనిఖీ చేశారు. అక్కడ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించిన సమమయంలో సర్వేలు సకాలంలో పూర్తి చేయాల న్నారు. గ్రామంలోని చెత్త నుంచి సంపద కేంద్రం తనిఖీ చేశారు. అనం తరం కొయ్యూరులో ని జిల్లా పరిషత్ అతిథి గృహాన్ని సందర్శించారు. దీని ఆధునికీకరణకు రూ. రూ. 20 లక్షలు మంజూరు చేస్తున్నట్టు ప్రకటించారు. నాణ్యతో ఈ మరమ్మతులు చేపట్టాలని పంచాయతీరాజ్ జేఈ రామకృష్ణను ఆదేశించారు. కొయ్యూరు, శింగవరం తాగునీటి పథకాల ట్యాంకులు పరిశీలించి రోజువారీ ట్యాంకుల నిర్వహణ తదితర విషయాలను తనిఖీ చేశారు. వేసవిలో తాగునీటి సమస్య రాకుండా చర్యలు చేపట్టాలని ఆర్‌డబ్ల్యూఎస్ జేఈకి సూచించారు. కొయ్యూరులో ప్రస్తుతం నెలకొన్న తాగునీటి ఎద్దడిని తెలుసుకున్నారు. రాజేంద్రపాలెంకు గ్రావిటీ ద్వారా వచ్చే నీటిలో మిగులు నీటిని కొయ్యూరు వాసులు వినియోగించుకునేలా తగినఏర్పాట్లు చేయాలని ఎంపీడీవోను ఆదేశించారు. అనం తరం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సీఈవోను ఎంపీడీవో తో పాటు సిబ్బంది, కార్యదర్శులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ప్రసాద్, పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈలు రామకృష్ణ, సాయి, పంచాయతీల కార్యదర్శులతో పాటు ఎంపీపీ బడుగు రమేశ్‌బాబు, జడ్పీటీసీ సభ్యుడు నూకరాజు, రాజేంద్రపాలెం సర్పంచి సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

రహదారులకు నిధులు మంజూరు చేయాలి

» గిరిజన సంక్షేమశాఖ మంత్రి సంధ్యారాణిని కోరిన గిడ్డి ఈశ్వరి



మంత్రి సంధ్యారాణితో మాట్లాడుతున్న గిడ్డి ఈశ్వరి

పాడేరురూరల్, మార్చి 20(ఆంధ్రజ్యోతి): పాడేరు నియోజకవర్గంలో వివిధ రహదారుల నిర్మాణాలకు నిధులు మంజూరు చేయాలని రా ష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖా మంత్రి గుమ్మడి సంధ్యారాణిని మాజీ ఎమ్మెల్యే టీడీపీ పాడేరు నియోజకవర్గ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి కోరారు. గురువారం ఆమె అమరావతిలోని సచివాలయంలో మంత్రిని మర్యాద పూర్వకంగా కలిసి సమస్యలను వివరించారు. నియోజకవర్గంలో రహదారుల నిర్మాణాలకు సుమారు రూ. 200 కోట్లకు పైగా నిధులు అవసరం ఉందన్నారు. ముందగా రూ. 150 కోట్లయినా మంజూరు చేయాలని ఆమె కోరారు. పాడేరు రోడ్డు విస్తరణ పనులకు నిధులను మంజూరు చేయాలని కోరారు. గిరిజన గ్రామాల్లో తాగునీటి సమస్యలను ఆమె దృష్టికి తీసుకువెళ్లారు. పాడేరు మండలంలో ఓం శాంతి మందిర నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఓంశాంతి ప్రతినిధులతో కలిసి ఆమె మంత్రిని కోరారు. వైద్య సిబ్బందికి ప్రోత్సాహకాలు చెల్లించాలని హెల్త్ ప్రిన్సిపాల్ సెక్రటరీని కోరినట్టు ఈశ్వరి తెలిపారు.

తేనెటీగల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ అవసరం

» శాస్త్రవేత్త మోహనరావు



మాట్లాడుతున్న ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మోహనరావు

చింతపల్లి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): తేనెటీగల సంరక్షణపై రైతులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఏలూరు విజయరాయి వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త, అధిపతి డాక్టర్ కె. మోహనరావు అన్నారు. గురువారం స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో జరుగుతున్న శాస్త్రీయ పద్ధతిలో తేనెటీగల పెంపకం శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన ప్రాంత వాతావరణం తేనెటీగల పెంపకానికి అనుకూలమన్నారు. రైతులు తేనెపెట్టల నిర్వాహణలో ఈగలను ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. ప్రధానంగా తేనెపెట్టెల్లో వచ్చే మైనపు పురుగులను నియంత్రించుకోవాలన్నారు. యూరోపియన్ ఫౌల్ బ్రూడ్ వ్యాధి, సాక్ బ్రూస్ వైరస్ సకాలంలో గుర్తించి నివారణ చర్యలు ప్రారంభించాలన్నారు. కందిరీగలు, పక్షుల దాడుల నుంచి కాపాడుకోవాలన్నారు. రైతులు అడవీ తేనె సేకరణ సమయంలోనూ ప్రత్యేక శాస్త్రీయ పద్ధతులు పాటించాలన్నారు. ఈకార్యక్రమంలో ఏడీఆర్ డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి, శాస్త్రవేత్తలు సందీప్ నాయక్, జోగారావు, టీచింగ్ అసోసియేట్ బాబూజినాయుడు, టీచింగ్ అసిస్టెంట్ శ్వేత, రైతులు పాల్గొన్నారు.

కేజీబీవీలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

కొయ్యూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక కస్తూర్బా గాంధీ విద్యాలయంలో 2025-26 విద్యా సంవత్సరానికి గానూ వివిధ తరగతుల్లో ప్రవేశాలకు విద్యార్థులనుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఎస్‌వో పరిమళ తెలిపారు. 6వ తరగతిలో 40 సీట్లు, 7వ తరగతి 2, ఎనిమిదో తరగతి 1, తొమ్మిదో తరగతి 1, పదో తరగతి 8 సీట్లతో పాటు ఇంటర్ ప్రథమ సంవత్సరం 40 సీట్లు, ద్వితీయ సంవత్సరం 1 సీటు భర్తీ చేయనున్నట్టు చెప్పారు. ఈ నెల 22 నుంచి ఏప్రిల్ 11 తేదీ వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. వివరాలకు పాఠశాలలో తమ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

'పది' పరీక్షల్లో మాస్‌కాపీయింగ్?



సీసీ కెమెరాలు లేని కేజీబీవీ పరీక్ష కేంద్రం

అనంతగిరి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కేజీబీవీ పరీక్ష కేంద్రంలో సీసీ కెమెరాలు లేక మాస్‌కాపీయింగ్ జరుగుతున్నట్లుగా ఆరోపణలు విన్పిస్తున్నాయి.. ఈ ఏడాది కొత్తవలస పరీక్ష కేంద్రంలోనూ నూతనంగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు కొన్ని సాంకేతిక సమస్యలతో పనిచేయడంలేదని సమాచారం. అలాగే, అనంతగిరి, శివలింగపురం పరీక్ష కేంద్రాల్లోనూ మాస్‌కాపీయింగ్ జరుగుతున్నట్టు విమర్శలు తలెత్తుతున్నాయి. ఆయా పరీక్ష కేంద్రాలకు పాఠశాల హెచ్‌ఎంలే చీఫ్‌లుగా ఉండడం గమనార్హం.. ఇప్పటికే రెండు పరీక్షలు జరిగాయి. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని, ఇకపై మాస్‌కాపీయింగ్ జరగకుండా ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

జడ్పీ నిధులతో మోటారు బోరు

డుంబ్రిగుడ,మార్చి20(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోర్రా పంచాయతీ గోందివలస గ్రామంలో తాగునీటీ సమస్యలు తీర్చేందుకు జడ్పి నిధులతో మోటారు బోరును ఏర్పాటు చర్యలు చేశారు. ఆ పంచాయతీ సర్పంచి అర్జున్ బోరు తవ్వించేందుకు కొబ్బరికాయ కోట్టీ ప్రారంభించారు. గోందివలసలో నీటీ వనరులు లేక గతంలో గ్రామాస్తులు ఇబ్బందులు పడేవారన్నారు. జడ్పిటీసీ నిధులతో తాగునీటీ కష్టాలు తీరుతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్ ప్రవీణ్, నాయకులు బాలరాజు గ్రామస్తులు పాల్గోన్నారు.

పారిశుధ్య కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలి

సీలేరు, మార్చి 20 , (ఆంధ్రజ్యోతి): సీలేరు గ్రామ పంచాయతీ పరిధిలో పనిచేస్తున్నఅవుట్ సోర్సింగ్ పారిశుధ్య కార్మికులకువేతన పెంపుతోపాటు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ సీఐటీయూ నాయకులు స్థానిక గ్రామ కార్యదర్శి పరశురామ్, సర్పంచి దుర్జోలకు వినతపత్రం అందజేశారు. ఆరుగురు పారిశుధ్య కార్మికులు గత 15 ఏళ్లుగా పనిచేస్తున్నారని, వారికి కనీస వేతనం, ఉద్యోగ భద్రత , వారంతపు సెలవులు తదితర సదుపాయలను పొందలేకపోతున్నారన్నారు. చాలీచాలని జీతాలతో దుర్భరమైన జీవితాలను గుడుపుతున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ టీయూ నేతలు ఎస్‌కే సుభాన్, బి. ల క్ష్మణరావు, కార్యదర్శి టి విష్ణుకుమార్, కన్వీనర్ ఎంవీ రమణ, ఎగ్జిక్యూటీవ్ మెంబర్ వనముల రాము తదితరులు పాల్గొన్నారు.

'బీజేపీ బలోపేతానికి కృషి'

జి.మాడుగుల, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఆ పార్టీ నేత, ట్రైకార్ డైరెక్టర్ కూడ కృష్ణారావు సూచించారు. మండలంలో ఆయన గురువారం సందర్శించి స్థానిక పార్టీ నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రానున్న స్థానిక ఎన్నికలకు ఇప్పటి నుంచే గ్రామ స్థాయిలో కమిటీల ఎంపిక చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలకు వివరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు సాగిన సింహాచలం, వి.సుబ్బారావు, కె.పార్వతమ్మ, కె.లక్ష్మణ్, కె.మహేశ్, చిరంజీవి, పద్మ, ఝాన్సీ లక్ష్మచారి, పరమేశ్వరరావు పాల్గొన్నారు.

బైకును ఢీ కొన్న కారు: ఇద్దరికి గాయాలు



ప్రమాదంలో నుజ్జయిన బైకు

డుంబ్రిగుడ, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): అరకు-పాడేరు ప్రధాన రహదారి బురదగెడ్డ వద్ద బైకును కారు ఢీకొన్న సంఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. కోర్రాయి పంచాయతీ జాకరవలసకు చెందిన ఇద్దరు యువకులు అరకు నుంచి స్వగ్రామానికి వెళ్తుండగా, పాడేరు నుంచి అరకువైపు వస్తున్న కారు బురదగెడ్డ మలుపులో వీరి బైకును బ లంగా ఢీకోంది. బైక్‌నున్న ఇద్దరు యువకులకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను అరకు ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు.

మాకవరపాలెంలో ఆశీల వసూలుకు వేలం



ఆశీల వసూలుకు వేలం నిర్వహిస్తున్న ఎంపీడీవో సీతామహాలక్ష్మి

మాకవరపాలెం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : మేజర్ పంచాయతీ మాకవరపాలెంలో రోజువారీ ఆశీల వసూలుకు సంబంధించి గురువారం ఇక్కడి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో సీతామహాలక్ష్మి ఆధ్వర్యంలో వేలం పాట నిర్వహించారు. ఇరవై మంది పాటదారులు హాజరయ్యారు. తొలుత సర్కారువారి పాట రూ.2.6 లక్షలుగా అధికారులు ప్రకటించగా, తాళ్లపాలెం గ్రామానికి చెందిన కన్నాజీ రూ.2.68 లక్షలకు పాటను దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ పథకాలు తక్షణం అమలు చేయాలి



విద్యుత్ బిల్లులను దహనం చేస్తున్న సీపీఎం శ్రేణులు

గొలుగొండ, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సుద్దలపాలెం, గదబపాలెం, బుడ్డపాడు, ఎన్.గదబపాలెం గ్రామాల్లో సీపీఎం ఆధ్వర్యంలో గురువారం ప్రజా చైతన్య యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ కూటమి నాయకులు ఎన్నికల ముందు ఇచ్చిన హామీల మేరకు సూర్ సిక్స్ పథకాలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. వాతావరణం అనుకూలించక పోవడంతో ప్రస్తుతం జీడిమామిడి తోటలకు కాపులేదన్నారు. దీంతో ఆయా రైతులు ఆందోళన చెందుతున్నట్టు చెప్పారు. సదరు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఉపాధి పథకంలో కూలీలకు రెండు వందల రోజులు పనిదినాలు కల్పించి, ఆరువందల రూపాయలు కూలి చెల్లించాలని డిమాండ్ చేశారు. అంతకుముందు విద్యుత్ సంస్కరణలకు వ్యతిరేకంగా విద్యుత్ బిల్లులను దహనం చేశారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు అడిగర్ల రాజు, మండల కార్యదర్శి ఎం.రాజు తదితరులు పాల్గొన్నారు.

‘తాండవ’ మెయిన్ గేట్లకు చకచకా మరమ్మతులు

»» ఇప్పటికే 70శాతం పూర్తి »» రబ్బర్ సీల్స్ ఏర్పాటు చేస్తే పూర్తిస్థాయిలో లీకేజీలు తగ్గుముఖం »» ప్రాజెక్టు కమిటీ చైర్మన్ సత్యనారాయణ

నాతవరం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : తాండవ రిజర్వాయర్ మెయిన్ గేట్ల లీకేజీలను పూర్తిస్థాయిలో అరికడుతున్నట్టు ప్రాజెక్టు కమిటీ చైర్మన్ కరక సత్యనారాయణ తెలిపారు. లీకేజీలను అరికటేందుకు ధవళేశ్వరం నుంచి వచ్చిన నిపుణులు ఇప్పటి వరకు చేపట్టిన మరమ్మతు పనులను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తాండవ మెయిన్ గేట్ల లీకేజీలను అరికట్టేందుకు రూ. 11.4లక్షలు మంజూరుకాగా, ఈ నిధులతో చకచకా పనులు జరుగుతున్నాయన్నారు. ఇప్పటికే 70శాతం పనులు పూర్తయినట్టు చెప్పారు. ఇంకా ఇరవై క్యూసెక్కుల నీరు లీకేజీల రూపంలో వృథాగా బయటకు పోతుందన్నారు. ఈ లీకేజీలను పూర్తిగా అరికట్టాలంటే రబ్బరు సీల్స్, బేరింగ్స్ ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. సంబంధిత కాంట్రాక్టర్ ద్వారా వీటిని తెప్పించి మెయిన్‌గేట్ల లీకేజీలను పూర్తిసాయిలో అరికట్టడం జరుగుతుందన్నారు. 52వేల ఎకరాలకు సాగునీరు అందించే తాండవ గరిష్ట నీటిమట్టం 380 అడుగులు కాగా, ప్రస్తుతం 365 అడుగుల నీటినిల్వలు ఉన్నట్టు చెప్పారు. గత ఏడాది మార్చి 20వ తేదీ నాటికి ఇందులో 356 అడుగుల నీటినిల్వలు మాత్రమే ఉండేవన్నారు. లీకేజీల మరమ్మతు పనులు పూర్తి చేస్తే వచ్చే ఖరీఫ్‌కు తాండవ ఆయకట్టు రైతుల సాగునీటికి ఇబ్బందులు ఉండవని ఆయన వివరించారు. ఈలోపు కుడి, ఎడమ కాలువల్లో పూడిక తీయాల్సి ఉందన్నారు. పూడితతీత పనులు పూర్తయితే రిజర్వాయర్ పరిధిలోని చివరి భూములకు సైతం నీరు అందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు నందిపల్లి వెంకటరమణ, నాయకులు రామకృష్ణలతో పాటు తాండవ ప్రాజెక్టు సిబ్బంది పాల్గొన్నారు.



తాండవ మెయిన్ గేట్లను పరిశీలిస్తున్న చైర్మన్ సత్యనారాయణ బృందం

ప్రకృతి వ్యవసాయంతో సంపూర్ణ ఆరోగ్యం



ఎస్‌బీపట్నంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఏవో శైలజ తదితరులు

నాతవరం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : ప్రకృతి వ్యవసాయంతో సంపూర్ణ ఆరోగ్యమని మండల వ్యవసాయాధికారిణి శైలజ అన్నారు. ప్రకృతి వ్యవసాయం ప్రాధాన్యత చాటుతూ గురువారం ఎస్‌బీపట్నంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంచామృతం, జీవామృతం, వేప కాషాయం వాడుతూ వ్యవసాయం చేయాలని రైతులకు సూచించారు. రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించాలన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఎస్‌బీపట్నంలో అందరితో సమావేశం ఏర్పాటు చేయగా ప్రకృతి వ్యవసాయం చేసేందుకు వందశాతం మంది రైతులు ఆమోదం తెలపడంపై ఆనందం వ్యక్తం చేశారు. ఏపీఎం కనకరాజు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం చేయడానికి మహిళలకు రుణ సదుపాయం కూడా ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లోకవరపు సత్యనారాయణ,తదితరులు పాల్గొన్నారు.

రెల్లి కులస్థుల హక్కుల సాధనకు
22న నర్సీపట్నంలో భారీ ర్యాలీ

»» సంఘం జిల్లా అధ్యక్షుడు యర్రంశెట్టి అప్పన్నబాబు

కృష్ణాదేవిపేట, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ వర్గీకరణలో రెల్లి సామాజికవర్గానికి ఒక్కశాతం రిజర్వేషన్ కల్పించడం అన్యాయమని రెల్లి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు యర్రంశెట్టి అప్పన్నబాబు అన్నారు. ఇందుకు నిరసనగా శనివారం ఉదయం పది గంటలకు జిల్లా వ్యాప్తంగా ఉన్న రెల్లి కులస్థులతో నర్సీపట్నంలో భారీ ర్యాలీ నిర్వహించనున్నామన్నారు. ఈ కార్యక్రమాన్ని అంతా జయప్రదం చేయాల్సిందిగా పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం కృష్ణాదేవిపేటలో విలేకర్లతో మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణలో రెల్లిలకు ఒక్కశాతం రిజర్వేషన్ కల్పించడం అన్యాయమన్నారు. దీనిని ఐదు శాతానికి పెంచాలని డిమాండ్ చేస్తూ నర్సీపట్నంలో భారీ ర్యాలీ నిర్వహించతలపెట్టినట్టు చెప్పారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న పదిహేను వందల మంది రెల్లి కులస్థులు హాజరుకానున్నారన్నారు.

ఏయూ బేస్‌బాల్ జట్టుకు
డిగ్రీ కళాశాల విద్యార్థి ఎంపిక



ఎంపికైన విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ రాజు

నర్సీపట్నం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రా యూనివర్సిటీ బేస్‌బాల్ జట్టులో ఇక్కడి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థికి చోటు దక్కింది. ఇంటర్ యూనివర్సిటీ బేస్‌బాల్‌కు సంబంధించిన జట్టు కోసం బుధవారం ఆంధ్రా యూనివర్సిటీలో సెలక్షన్స్ నిర్వహించారు. నర్సీపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ తృతీయ సంవత్సరం చదువుతున్న రావుల సోమేశ్వరరావు ఆంధ్రా యూనివర్సిటీ జట్టులో ఆడేందుకు ఎంపికయ్యాడు. త్వరలో పంజాబ్‌లో జరగనున్న ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ బేస్‌బాల్ టోర్నమెంట్‌లో ఇతడు ఆడతాడు. 2023లో గౌహతిలో జరిగిన ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ బేస్‌బాల్ టోర్నమెంట్‌లో సోమేశ్వరరావు చక్కని ప్రతిభ చూపాడని ప్రిన్సిపాల్ ఎస్.రాజు తెలిపారు. ఈ సందర్భంగా అతనిని ప్రిన్సిపాల్‌తో పాటు వైస్ ప్రిన్సిపాల్, పీడీ, అధ్యాపకులు అభినందించారు.

24 నుంచి ఉచితంగా ఎంసెట్ కోచింగ్

నర్సీపట్నం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని రామారావుపేటలో గల సన్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో ఎంసెట్‌కు హాజరు కానున్న విద్యార్థులకు ఉచితంగా కోచింగ్ ఇవ్వనున్నారు. ఈ నెల 24 నుంచి తరగతులు ప్రారంభిస్తామని సొసైటీ వ్యవస్థాపకులు సూరెడ్డి అప్పలనాయుడు, కరస్పాండెంట్ ఉమామహేశ్వరి తెలిపారు. ఈ అవకాశాన్ని ఎంసెట్ రాసే విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా వారు కోరారు.

నర్సీపట్నంలో
రూ.48 లక్షలతో డ్రైనేజీల్లో పూడిక తీత

నర్సీపట్నం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని డ్రైనేజీల్లో పూడిక తీతపనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. రూ.48 లక్షల అంచనాలతో మెయిన్ రోడ్డులో ఈ పనులను ప్రారంభించారు. కాలువల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం కారణంగా మురుగు ముందుకు పారక పోవడంతో దుర్వాసన, దోమ బెడద అధికంగా ఉండేది. ఇది గుర్తించిన మునిసిపల్ కమిషనర్ సురేంద్ర పూడిక తీత పనులకు అంచనాలు తయారు చేయించి, ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపడంతో నిధులు మంజూరయ్యాయి. రెండు నెలలుగా ఎక్స్‌కవేటర్లు, ట్రాక్టర్ల సాయంతో ఈ పనులు సాగుతున్నాయి. ఇప్పటికి 90 శాతం పనులు పూర్తి చేశామని డీఈఈ సోమేశ్వరరావు తెలిపారు.

ఏఎల్‌పురంలో...

కృష్ణాదేవిపేట : గొలుగొండ మండలంలోని మేజర్ పంచాయతీ ఏఎల్‌పురంలో గురువారం పారిశుధ్య పనులను ముమ్మరంగా చేపట్టారు.ఈవోపీఆర్‌డీ కె.శ్రీనివాసరావు పర్యవేక్షణలో పారిశుధ్య కార్మికులు, కూలీలు బీసీ కాలనీ, హైస్కూల్ రోడ్డు, వినాయక వీధుల్లో రోడ్లపై చెత్తాచెదారంతో పాటు ఇరువైపులా ఉన్న పిచ్చితుప్పలను తొలగించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లోచల సుజాత, కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



మెయిన్ రోడ్డులో పూడిక తీత పనులు జరుగుతున్న దృశ్యం

ఏఎల్‌పురంలో బాలికల వసతి గృహం

»» నిర్మాణ పనులకు ప్రభుత్వం రూ.2.12 కోట్లు మంజూరు
»» స్థల పరిశీలన జరిపిన తహశీల్దార్ శ్రీనివాసరావు

కృష్ణాదేవిపేట, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : గొలుగొండ మండలంలోని ఏఎల్ పురంలో బాలికల వసతి గృహం ఏర్పాటుకు ప్రభుత్వం రూ.2.12 కోట్లు మంజూరు చేసినట్టు తహశీల్దార్ కె.శ్రీనివాసరావు తెలిపారు. ఇందుకు సంబంధించి భవన నిర్మాణానికి 30 సెంట్ల స్థలాన్ని సేకరించేందుకు గురువారం సాయంత్రం ఆయన సదరు గ్రామంలో పర్యటించారు. ఇక్కడి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో సుమారు తొమ్మిది వందల మంది గిరిజన, మైదాన ప్రాంతాలకు చెందిన విద్యార్థినులు విద్యనభ్యసిస్తున్నారు. సుదూర ప్రాంతాల నుంచి వీరు పాఠశాలకు రావడం ఇబ్బందిగా మారింది. ఇది గుర్తించి బాలికలకు వసతి కల్పించేందుకు గతంలో ప్రణాళిక రూపొందించారు. ఇందులో భాగంగా ఈ నిధులు మంజూరయ్యాయి. త్వరలో భవనాల నిర్మాణం చేపట్టేందుకు స్థల సేకరణ జరుపుతున్నట్టు తహశీల్దార్ చెప్పారు. ప్రస్తుతం స్థల సేకరణ జరిగిందని, జిల్లా కలెక్టర్‌కు నివేదిక అందిస్తామన్నారు. త్వరలో భవన నిర్మాణపనులు జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో జేఈఈ సత్యనారాయణ, టీడీపీ మండల అధ్యక్షుడు అడిగర్ల అప్పలనాయుడు, ఎంపీటీసీ రుత్తల రామకృష్ణ, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ లగుడు రాజులు నాయుడు, టీడీపీ నాయకులు బొడ్డు జమీలు, లగుడు రమేష్, సన్నిబాబు, స్వామినాయుడు, అప్పలనాయుడు , వీఆర్‌వో రాజు తదితరులు పాల్గొన్నారు.



స్థల పరిశీలన జరుపుతున్న తహశీల్దార్ శ్రీనివాసరావు, తదితరులు

ఘనంగా మరిడిమాంబ తీర్థం



అమ్మవారిని దర్శించుకుంటున్న మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలు నాయుడు, తదితరులు

మాడుగుల, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మాడుగుల శివారునున్న మరిడిమాంబ అమ్మవారి ఆలయం వద్ద తీర్థ మహోత్సవం గురువారంఘనంగా జరిగింది. పలువురు భక్తులు అమ్మవారికి ఘటాలతో మొక్కులు, ముడుపులు చెల్లించుకున్నారు. మోదకొండమ్మ అమ్మవారి ఆలయ చైర్మన్ పుప్పాల అప్పలరాజు, మాజీ మంత్రి బూడి ముత్యాలనాయుడుతో పాటు పలువురు నాయకులు అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. మధ్యాహ్నం అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంత్రం డ్యాన్స్ బేబీ డ్యాన్స్ సాంస్కృతిక ప్రదర్శన ఏర్పాటు చేశారు. మరిడిమాంబ ఆలయ అభివృద్ధికి తనవంతుగా కృషి చేస్తామని మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు అన్నారు. తీర్థ మహోత్సవం పురస్కరించుకుని అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ఎడ్ల పరుగు పోటీలలో గెలుపొందిన విజేతలకు రా మానాయుడు చేతులమీదుగా నగదు బహుమతి అందించారు.

‘ఎస్సీ వర్గీకరణలో రెల్లి కులస్థులకు అన్యాయం’

కె.కోటపాడు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణలో రెల్లి కులస్థులకు తీరని అన్యాయం జరిగిందని రెల్లి హక్కుల రిజర్వేషన్ పోరాట సమితి మండల అధ్యక్షుడు వడ్డాది కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. స్థానిక రెల్లివీధిలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణలో అన్ని రంగాల్లో అణగారిన రెల్లి కులానికి ఐదు శాతం రిజర్వేషన్ వాటా పెంచి సామాజిక న్యాయం చేస్తారని ఆశిస్తే ఒక శాతం మాత్రమే కేటాయించి అన్యాయం చేశారన్నారు. మాలలకు 6.5 శాతం మాదిగలకు 7.5 శాతం రిజర్వేషన్ కేటాయించారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచి భూపతి కోటేశ్వరరావు, భూపతి త్రినాద్, అప్పలరాజు, వడ్డాది శ్రీను, వడ్డాది నరసింహమూర్తి, భూపతి గణేశ్, మోహనరావు, కోటయ్య పాల్గొన్నారు.

రేషన్ కార్డుదారులకు ఈకేవైసీ తప్పనిసరి

రోలుగుంట, మార్చి 20(ఆంధ్రజ్యోతి) : మండలంలోని 24 పంచాయతీల్లో 38 రేషన్ డిపోల పరిధిలోని రేషన్‌కార్డుదారులు ఈకేవైసీ తప్పక చేయించుకోవాలని తహసీల్దార్ నాగమ్మ తెలిపారు. ఈ నెలాఖరు లోగా ఐదేళ్ల నుంచి 50 ఏళ్ల వయస్సు గల వారుఈకేవైసీచేయించుకోకుంటే రేషన్ సరుకులు తీసుకునే అవకాశం కోల్పోతారన్నారు. సమీప రేషన్ డీలర్ వద్దకు వెళ్లాలన్నారు.

గాలికుంటు వ్యాధి టీకాల ప్రక్రియ వేగవంతం



టీకా కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఏడీ చిట్టినాయుడు

చీడికాడ, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): గాలి కుంటు వ్యాధి టీకాల ప్రక్రియను వేగవంతం చేయాలని పశు సంవర్థక శాఖ సహాయ సంచాలకులు చిట్టినాయుడు ఆదేశించారు. గురువారం తంగుడు పల్లిలో జరిగిన టీకాల కార్యక్రమం ను పరిశీలించారు. పశువైద్యాధికారి గణేశ్‌కుమార్ పాల్గొన్నారు.

నేటి నుంచి పీ 4 సర్వేపై గ్రామసభలు

చోడవరం, మార్చి20(ఆంధ్రజ్యోతి): మండలంలో శుక్రవారం నుంచి పీ 4 సర్వేకు సంబంధించి గ్రామసభలు నిర్వహిస్తున్నట్టు ఎండీవో పీవీఎస్ ఆంజనేయులు తెలిపారు. పేదరిక నిర్మూలన కార్యక్రమంలో భాగంగా పబ్లిక్ ప్రైవేట్, పీపుల్ పార్టిసిపేషన్ సర్వేలో వివరాలను నేటి గ్రామ సభల్లో ముందుంచి సభ ఆమోదం పొందాల్సి ఉంటుందని ఎంపీడీవో తెలిపారు.

గోవాడలో చెరకు రైతుల ధర్నాను జయప్రదం చేయాలి

»» రైతు సంఘం నేతల ప్రచారం

చోడవరం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): గోవాడ చెరకు రైతుల సమస్యలపై ఈనెల 21 శుక్రవారం గోవాడలో తలపెట్టిన చెరకు రైతుల మహాధర్నాను జయప్రదం చేయాలని రైతు సంఘం నాయకుడు రెడ్డిపల్లి అప్పలరాజు కోరారు. మహాధర్నాపై గురువారం మండలంలోని పంచాయతీల్లో ప్రచారం నిర్వహించారు. గోవాడ ఫ్యాక్టరీ భవితవ్యం, క్రషింగ్‌లో రైతుల ఇబ్బందులపై ప్రభుత్వ ఉదాసీన వైఖరితో పాటు, స్థానిక ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యానికి నిరసనగా తలపెట్టిన ఈ ఆందోళనకు రైతులంతా తరలిరావాలని కోరారు. ఫ్యాక్టరీని మూసివేసేందుకు జరుగుతున్న కుట్రను రైతులంతా సంఘటితంగా అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. గోవాడ షుగర్ ఫ్యాక్టరీని కాపాడుకోవడానికి ప్రతి చెరకు రైతు ముందుకురావాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు, ఏపీ చెరకు రైతు సంఘం నాయకులు కర్రి అప్పారావు, నాగిరెడ్డి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బుచ్చెయ్యపేట: గోవాడ షుగర్స్ సమస్యలపై శుక్రవారం జరుగుతున్న మహాధర్నాకు రైతులు, ప్రజలు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని రైతుసంఘం సభ్యులు ఎస్‌వీ నాయుడు, మండల అధ్యక్షులు పినపాత్రుని సాంబశివరావు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా గురువారం వారు మండలంలో వడ్డాది, బంగారుమెట్ట, విజయ రామరాజుపేట గ్రామాల్లో కరపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ సమస్యలపై షుగర్స్ చైర్మన్, కలెక్టర్ తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. షుగర్స్ రైతులకు, కార్మికులకు బకాయిలు చెల్లించాలని కోరారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి తక్షణ సహాయం అందించి ఫ్యాక్టరీని ఆధునికీకరించాలని కోరారు.



కరపత్రాల పంపిణీలో రైతు సంఘం నాయకులు

కేపీ అగ్రహారానికి 11 బోర్లు మంజూరు



బోరు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న జడ్పీటీసీ సభ్యుడు

బుచ్చెయ్యపేట, మార్చి 20(ఆంధ్రజ్యోతి): మండలంలో జడ్పీ నిధులతో కేపీ అగ్రహారం గ్రామానికి 11 చేతిబోర్లు మం జూరయ్యాయి. ఈ బోర్లను గురువారం జడ్పీటీసీ సభ్యుడు దొండా రాంబాబు ప్రారంభించారు. గ్రామసర్పంచి గోపిశెట్టి శ్రీనివాసరావు అభ్యర్థనమేరకు చైర్‌పర్సన్ ఈ నిధులను కేటాయించినట్టు దొండా రాంబాబు తెలిపారు.

బీసీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తులు ఆహ్వానం

దేవరాపల్లి, మార్చి20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బీసీ కార్పొరేషన్ రుణాలు పొందడానికి ఈనెల 22లోగా దరఖాస్తు చేయాలని ఎంపీడీఓ సువర్ణరాజు తెలిపారు. మండలానికి 91 యూనిట్‌లు మంజూరు కాగా, 50 శాతం సబ్సిడీపై మండలానికి రూ. 1.74 కోట్లు మంజూరయ్యాయన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, కులధృవీకరణ పత్రాలు జత చేయాలన్నారు.

టీడీపీ సభ్యత్వ కార్డుల పంపిణీ



కార్డులందజేస్తున్న టీడీపీ మండల అధ్యక్షుడు కొండనాయుడు

రావికమతం, మార్చి20 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వ కార్డులను క్లస్టర్, బూత్ ఇన్‌చార్జీలకు పార్టీ మండల అధ్యక్షుడు రాజాన కొండనాయుడు గురువారం అందించారు. సెప్టెంబరు, అక్టోబరులలో మండలంలో 16,500 టీడీపీ సభ్యత్వాలను నమోదు చేశారు. ఈ మేరకు రాష్ట్ర పార్టీ జారీ చేసిన కార్డులను 28 గ్రామ పంచాయతీల వారీగా గ్రామాలకు నేరుగా వెళ్లి అందజేశారు.ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు బంటు శ్రీను, రావికమతం ఉప సర్పంచి గంజి మోదునాయుడు, గల్లా నానిబాబు తదితరులు పాల్గొన్నారు.

వస్త్ర దుకాణం చోరీ కేసులో ఒకరి అరెస్టు

చోడవరం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక వస్త్ర దుకాణంలో బట్టలు దొంగతనానికి పాల్పడిన చీడికాడ మండలం శిరిజాం గదబూరు గ్రామానికి చెందిన ఓ వ్యక్తిని గురువారం అరెస్టు చేసినట్టు స్థానిక సీఐ బి. అప్పలరాజు తెలిపారు.

గంజాయి స్వాధీనం: ముగ్గురిపై కేసు



నిందితులతో పోలీసులు

రావికమతం, మార్చి 20, (ఆంధ్రజ్యోతి): ఆటోలో తరలిస్తున్న పది కిలోల గంజాయిని స్వాధీనం చేసుకొని ముగ్గురిపై కేసు నమోదు చేసినట్టు కొత్తకోట ఎస్‌ఐ ఎం. శ్రీనివాస్ తెలిపారు. గురువారం దొండపూడి చెక్ పోస్ట్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా వడ్డాది నుంచి నర్సీపట్నం వైపు వెళ్తున్న ఆటోలోనుంచి ఇద్దరు వ్యక్తులు దిగి పారిపోతుండగా వీరిని వెంబడించి పట్టుకుని తనిఖీ చేశామన్నారు. వారిలో బ్యాగుల్లో పది కిలోల గంజాయిని గుర్తించామన్నారు. ఏజెన్సీ ప్రాంతం నుంచి తుని రైల్వే స్టేషన్‌కు ఈ గంజాయిని తరలిస్తున్నట్టు నిందితులు తెలిపారన్నారు. దర్యాప్తులో భాగంగా వీరికి గంజాయి అమ్మిన వ్యక్తిని కూడా అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

దేవరాపల్లి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మారేపల్లికి విద్యుత్ సరఫరా శుక్రవారం ఉదయం 9నుంచి నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నట్టు ఏఈఈ కర్రి.శంకరరావు తెలిపారు. విద్యుత్ అంతరాయాలు తొలగించేందుకుపనులు చేపడుతున్నామన్నారు.

27 వరకు ఆధార్ ప్రత్యేక క్యాంపులు

రోలుగుంట: గ్రామ సచివాలయాల పరిధిలో ఆధార్ ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తున్నట్టు స్థానిక ఎంపీడీఓ నాగేశ్వరరావు తెలిపారు. 20న కొమరవోలు, 21న రత్నంపేట, కుసర్లపూడి, 22న జానకీరాంపురం, 25న కొవ్వూరు,జె.నాయుడుపాలెం, 27న కె.నాయుడుపాలెం, గుండుబాడుల్లో ఈశిబిరాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఆధార్, మొబైల్ ఫోన్ నెం అప్‌డేట్, నూతన కార్డులు జారీ తదితర సేవలను అందిస్తున్నట్టు వివరించారు.

నవచేతన నూతన విద్యపై శిక్షణ



మాట్లాడుతున్న ఐసీడీఎస్ సీడీపీవో మంగతాయారు

బుచ్చెయ్యపేట, మార్చి 20(ఆంధ్రజ్యోతి): మండలంలో విజయ రామ రాజుపేట జడ్పీ హైస్కూల్‌లో రావికమతం, రోలుగుంట, బుచ్చెయ్యపేట, చోడవరం మండలాలకు చెందిన అంగన్‌వాడీ కార్యకర్తలకు గురువారం శిక్షణ ప్రారంభించారు. మూడు రోజులపాటు జరిగే ఈ శిక్షణ కార్యక్రమం పోషణ్ పడాయి ఆదర్శి, నవచేతన తదితర అవగాహన కల్పించనున్నట్టు ఐసీడీఎస్ పీవో ఎస్.పుష్పదేవి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజేశ్వరి, సంతోషి, రత్నం పాల్గొన్నారు.

రావికమతం: రావికమతం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో మండలాల అంగన్‌వాడీ కార్యకర్తలకు మూడు రోజుల పాటు నవ చేతన,నూతన విద్యపై శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు సీడీపీఓ పుష్పదేవి తెలిపారు. గురువారం స్థానిక ప్రాజెక్టు కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు.

కె.కోటపాడు: స్థానిక మాత శిశు అభివృద్ధి పథకం కార్యాలయంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు ఈ శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. సీడీపీవో వి. మంగతాయారు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు ఎల్బీ సుశీల, జి. అదిలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఐదెకరాల జీడిమామిడి తోట దగ్ధం

రావికమతం, మార్చి 20, (ఆంధ్రజ్యోతి): మండలంలో చినపాచిలలో గు రువారం జరిగిన అగ్నిప్రమాదంలో ఐదెకరాల జీడిమామిడితోటతోపాటు ఒక పశువుల పాక దగ్ధమైం ది. ఈ ఘటనలో సాసుబిల్లి సత్యారావు, (శివయ్యనాయు) సాసుబిల్లి సత్యారావు, కలిమి గోవింద, సాసుబిల్లి అచ్చియ్యమ్మ, మద్దాల శేఖర్, సాసుబిల్లి సత్యనారాయణ(బుజ్జి) గోపాసిన సత్యనారాయణ లకు చెందిన జీడిమామిడి, నీలగిరి తోటలతోపాటు కరెడ్ల దేముళ్లకు చెందిన పశువుల పాక కాలిపోయాయి. జీడి తోటల ఫలసాయం అందే సమయంలో కాలిపోవడంపై బాధిత రైతులు విలపిస్తున్నారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు. సుమారు రూ. 3లక్షలకు పైగా ఆస్తినష్టం వాటిల్లినట్టు అంచనా.

బాధితుడికి బూడి పరామర్శ

దేవరాపల్లి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతున్న మండలంలోని కొత్తపెంట ఎంపీటీసీ సభ్యుడు మజ్జిదేవి భర్త రాజును అతని స్వగ్రామమైన ములకలాపల్లి వెళ్లి మాజీ ఉపముఖ్యమంత్రి బూడిముత్యాలనాయుడు పరామర్శించారు. అతని ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి, జడ్పీటీసీ సభ్యుడు కర్రిసత్యం, వైసీపీ మండల అధ్యక్షుడు బూరే.బాబూరావు, తదితరులు పాల్గొన్నారు.

రబీ పంటలకు తెగుళ్లు

వరిలో కాండం తొలుచు పురుగు

- మొక్కజొన్నను ఆశించిన కత్తెర పురుగు
- నువ్వు పంటకు ఆకు ముడత తెగులు
- చెరకు తోటల్లో పీక పురుగు
- నివారణ చర్యలు చేపట్టాలని ఏడీఆర్ ముకుందరావు సూచన

అనకాపల్లి అగ్రికల్చర్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి):

అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లోని పలు మండలాల్లో రబీలో సాగు చేస్తున్న పలు పంటలకు కొన్ని రకాల తెగుళ్లు ఆశించాయని, రైతులు వెంటనే నివారణ చర్యలు చేపట్టాలని అనకాపల్లి వ్యవసాయ పరిశోధనా స్థానం ఏడీఆర్ డాక్టర్ సీహెచ్ ముకుంద రావు సూచించారు. వరి, మొక్కజొన్న, వేరుశనగ, నువ్వు, చెరకు, బెండ, తదితర పంటలకు ఆశించిన తెగుళ్లు, నివారణ చర్యలతోపాటు ఎరువుల యాజమాన్యం గురించి ఆయన వివరించారు.

వరి: అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో రబీలో వేసిన వరిపైరు ప్రస్తుతం చిరు పొట్ట దశలో ఉంది. ఈ తరుణంలో ఎకరాకు 15 కిలోల యూరియా, 20 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ వేసుకోవాలి. వరి పైరును కొన్నిచోట్ల కాండం తొలుచు పురుగు ఆశించింది. దీని నివారణ కోసం ఎకరాకు ఎనిమిది కిలోల చొప్పున కార్బోహైడ్రోక్లోరైడ్ 4జీ గుళికలను 20 కిలోల ఇసుకతో కలిపి పొలం అంతటా సమానంగా చల్లుకోవాలి.

మొక్కజొన్న: కొద్ది రోజుల నుంచి వేసవిని తలపించేలా ఎండ కాస్తున్నది. అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. అందువల్ల మొక్కజొన్న తోటలకు దగ్గర దగ్గరగా నీటి తడులు ఇవ్వాలి. మొక్కజొన్న పంటను కత్తెర పురుగు ఆశిస్తే 1500 పీపీఎం వేపనూనె లీటరు నీటికి 5 మిల్లీలీటర్లు లేదా క్లోరిఫైరిఫాస్ 2.5 మిల్లీలీటర్లు నీటికి కలిపి పిచికారి చేయాలి.

వేరుశనగ: ఈ పంటను దీపపు పురుగు ఆశిస్తున్నది. దీని నివారణ కోసం లీటరు నీటికి 1.6 మిల్లీలీటర్ల మోనోక్రోటోఫాస్ లేదా రెండు మిల్లీ లీటర్ల డైమిథియేట్ మందును కలిపి పిచికారీ చేయాలి.

నువ్వు: పూత దశలో ఉన్న నువ్వు పైరుకు ఎకరాకు ఒక కిలో చొప్పున మల్టీకెన్ పిచికారీ చేయాలి. ఆకుముడత పురుగు నివారణకు లీటరు నీటికి 2.5 మిల్లీలీటర్ల క్లోరిఫైరిఫాస్, ఐదు మిల్లీలీటర్ల వేప నూనె కలిపి పిచికారీ చేయాలి. వేరుకుళ్లు తెగులు నివారణకు లీటరు నీటికి మూడు గ్రాముల చొప్పున మాంకోజెబ్ కలిపి మొక్క మొదళ్ల తడిసేలా పిచికారి చేయాలి.

చెరకు: ప్రస్తుత పొడి వాతావరణం, అధిక ఉష్ణోగ్రతల కారణంగా చెరకు తోటలను పీకపురుగు ఆశిస్తున్నది. దీని నివారణ కోసం 'ట్రైకోగ్రామా కిలోనిస్' అనే గుడ్డు పరాన్న జీవిని ఎకరాకు 20 వేల చొప్పున (ఒక కార్డు) చెరకు నాటిన 30 రోజుల నుంచి 7-10 రోజుల వ్యవధిలో నాలుగైదుసార్లు విడుదల చేయాలి. లేదంటే లీటరు నీటికి 1.6 మిల్లీలీటర్ల చొప్పున మోనోక్రోటోఫాస్ కలిపి పిచికారీ చేయాలి.

బెండ: ఎండల తీవ్రతకు బెండ పంటను రసం పీల్చు పురుగులు ఆశిస్తున్నాయి. వీటి నివారణ కోసం లీటరు నీటికి 1.6 మిల్లీ లీటర్ల చొప్పున మోనోక్రోటోఫాస్ కలిపి పిచికారీ చేయాలి.


డాక్టర్ ముకుందరావు, ఏడీఆర్, ఆర్ఏఆర్ఎస్


నువ్వులో ఆకు ముడత పురుగు


వరిని ఆశించిన కాండం తొలుచు పురుగు


మొక్కజొన్నను ఆశించిన కత్తెర పురుగు

సేంద్రీయ ఉత్పత్తుల స్టాల్ ప్రారంభం


సేంద్రీయ ఉత్పత్తులను విక్రయిస్తున్న దృశ్యం

అనకాపల్లి టౌన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక జీవీఎంసీ జోనల్ కార్యాలయ ఆవరణలో రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయంతో పండిన ఉత్పత్తులను గురువారం విక్రయించారు. ఇక్కడ ఏర్పాటు చేసిన స్టాల్‌ను రైతు సాధికార సంస్థ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ప్రారంభించారు. కార్యాలయానికి వచ్చే పలువురు స్టాల్‌లో ఏర్పాటు చేసిన కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు, చిరుధాన్యాలను కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా మార్కెటింగ్ నిర్వాహకుడు వర్మ మాట్లాడుతూ జిల్లా అంతటా ఈ స్టాల్స్ ద్వారా అమ్మకాలు చేపడుతున్నామన్నారు. ప్రతి సోమవారం మండల కార్యాలయ ఆవరణ, కలెక్టరేట్‌లో, ప్రతి గురువారం మునిసిపాలిటీ పరిధిలో ఈ అమ్మకాలు సాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ ఇన్‌చార్జులు అప్పలరాజు, గురువునాయుడు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జీడిమామిడి తోట దగ్ధం

- రూ.6 లక్షల ఆస్తి నష్టం


దగ్ధమైన జీడిమామిడి తోట

కొయ్యూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మారుమూల పంచాయతీ యు.చీడిపాలెంలో బుధవారం సాయంత్రం జరిగిన అగ్నిప్రమాదంలో ఆరుగురు రైతులకు చెందిన సుమారు ఆరున్నర ఎకరాల జీడిమామిడి తోట దగ్ధమైంది. సుమారు రూ.6 లక్షల ఆస్తి నష్టం వాటిల్లింది. దీనికి సంబంధించి బాధిత రైతులు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. యు.చీడిపాలెం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ పల్లాల అబ్బాయిరెడ్డికి చెందిన మూడు ఎకరాల జీడిమామిడి తోటలో అగ్నిప్రమాదం సంభవించి దీనిని ఆనుకుని ఉన్న పల్లాల పద్మ, లక్ష్మమ్మ, శ్రీనివాసరెడ్డి, వీరారెడ్డిలకు చెందిన తోటల్లోకి అగ్ని కీలలు వ్యాపించాయి. సాయంత్రం కావడంతో మంటలను అదుపు చేసే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. దీంతో పూత, పిందెతో ఉన్న ఆరున్నర ఎకరాలలో గల జీడిమామిడి తోటలు దగ్ధమైనట్టు బాధితులు తెలిపారు.

స్టీల్‌ప్లాంట్ మార్గంలో అదుపు తప్పిన కారు

రెండు ద్విచక్ర వాహనాలను ఢీకొనడంతో ఇద్దరికి గాయాలు


బోల్తా పడిన కారు

ఉక్కుటౌన్‌షిప్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ ప్రధాన మార్గంలో గురువారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదం స్థానికులను తీవ్ర భయాందోళనకు గురి చేసింది. వివరాలిలా ఉన్నాయి. అనకాపల్లి జిల్లా నర్సీపట్నానికి చెందిన జి.రాహుల్ అనే యువకుడు కారులో కూర్మన్నపాలెం నుంచి స్టీల్‌ప్లాంట్ మార్గంలో వెళ్తుండగా కణితి జంక్షన్ వద్ద అదే మార్గంలో ద్విచక్ర వాహనంపై ముందు వెళ్తున్న టౌన్‌షిప్ సెక్టార్-6 ప్రాంతానికి చెందిన కె.కోటేశ్వరరావు (61)ను ఢీకొన్నాడు. దీంతో కారు అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న చెట్టును బలంగా ఢీకొని మళ్లీ రోడ్డుపై బోల్తా పడింది. ఈ క్రమంలో అదే మార్గంలో మరో ద్విచక్ర వాహనంపై వస్తున్న పెదగంట్యాడ సమీపంలోని వెంపళ్లనగర్‌కు చెందిన ఇందల అప్పారావు (51)ను కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనదారులిద్దరికీ గాయాలయ్యాయి. ప్రస్తుతం వారిద్దరూ ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. కారును అతి వేగంగా నడపడం వల్లే ప్రమాదం జరిగినట్టు స్థానికులు చెబుతున్నారు.

ట్రాన్స్‌జెండర్ హత్య కేసులో నిందితుడి అరెస్టు

- వివరాలు వెల్లడించిన జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా
- పెళ్లి విషయంలో ఇరువురి మధ్య కొంతకాలంగా గొడవ
- రెండో పెళ్లి చేసుకుంటానన్న బన్నీ
- తనను మాత్రమే వివాహం చేసుకోవాలని పట్టుబట్టిన దీపు
- ట్రాన్స్‌జెండర్‌ను వదిలించుకోవాలన్న ఉద్దేశంతో హత్య
- మృతదేహాన్ని ముక్కలుగా నరికి, మూడుచోట్ల పడవేత
- ప్రత్యేక బృందాల ఏర్పాటుతో గంటల వ్యవధిలోనే నిందితుడి గుర్తింపు, అరెస్టు


మీడియా సమావేశంలో జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా, పోలీసు అధికారులు, ముఖానికి నల్లటి ముసుగుతో వున్న నిందితుడు బండి దుర్గాప్రసాద్ అలియాస్ బన్నీ

కశింకోట, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ట్రాన్స్‌జెండర్ మైపాలి దిలీప్‌శంకర్ అలియాస్ దీపు (35) హత్య కేసును పోలీసులు ఛేదించారు. నిందితుడిని అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా గురువారం స్థానిక పోలీసు స్టేషన్‌లో మీడియా సమావేశం ఏర్పాటు చేసి వివరించారు.

అనకాపల్లి పట్టణంలోని గవరపాలెం ప్రాంతానికి చెందిన మైపాలి దిలీప్ శంకర్ అలియాస్ దిపు, పశ్చిమ గోదావరి జిల్లా ఇరగవరం మండలం పొదలాడ గ్రామానికి చెందిన బండి దుర్గాప్రసాద్ అలియాస్ బన్నీ (24) సుమారు ఏడాది నుంచి మునగపాక మండలం నాగులాపల్లిలో ఒక అద్దె ఇంటిలో వుంటూ సహజీవనం చేస్తున్నారు. పెళ్లి విషయమై కొద్ది రోజులుగా ఇరువురి మధ్య గొడవ జరుగుతున్నది. ఈ నెల 17వ తేదీన మరోసారి పెళ్లి ప్రస్తావన రాగా.. రెండో భార్యగా వివాహం చేసుకుంటానని దుర్గాప్రసాద్ చెప్పాడు. ఇందుకు దీపు అంగీకరించలేదు. తనను మాత్రమే పెళ్లి చేసుకోవాలని పట్టుబట్టింది. దీంతో దీపును ఎలాగైనా వదిలించుకోవాలని నిర్ణయించుకున్నాడు. అదే రోజు మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో నాగులాపల్లి ఇంటిలోనే దీపు మెడకు వైరు బిగించి హత్య చేశాడు. తరువాత మృతదేహాన్ని బాత్‌రూమ్‌లోకి తీసుకెళ్లి కత్తితో శరీరాన్ని ముక్కలు ముక్కలుగా నరికాడు. మూడు మూటలుగా కట్టి బైక్, స్కూటీపై (బుల్లెట్ దుర్గాప్రసాద్‌ది, స్కూటీ దీపుది) వేర్వేరు సమయాల్లో తీసుకెళ్లి జలగలమదుం జంక్షన్ సమీపంలో, తాళ్లపాలెం సమీపంలో అండర్ బ్రిడ్జి వద్ద, బయ్యవరం అండర్ బ్రిడ్జి వద్ద పడేశాడు. పోలీసులు మంగళవారం ఉదయం తొలుత బయ్యవరం వద్ద కొన్ని శరీర భాగాలు వున్న ఒక మూటను స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తులో భాగంగా మిగిలిన శరీర భాగాల కోసం పోలీసులు వేర్వేరు బృందాలుగా ఏర్పడి గాలింపు చర్యలు చేపట్టారు. బుధవారం ఉదయం జలగలమదుం జంక్షన్ వద్ద ఒక మూటను, తరువాత తాళ్లపాలెం మామిడివాక గెడ్డ వద్ద మరోమూటను స్వాధీనం చేసుకుని హత్యకు గురైంది ట్రాన్స్‌జెండర్ మైపాలి దిలీప్ శంకర్ అలియాస్ దిపుగా నిర్ధారించారు. నాగులాపల్లిలో దీపుతో కలిసి వుంటున్న దుర్గాప్రసాద్ అలియాస్ బన్నీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. 19వ తేదీ సాయంత్రం 6.30 గంటల సమయంలో కశింకోట మండలం విస్సన్నపేట వద్ద అదుపులోకి తీసుకొని అరెస్టు చేశారు. దీపును వదిలించుకుని, ఆమె వద్ద వున్న బంగారు ఆభరణాలు, నగదును సొంతం చేసుకోవడానికే దుర్గాప్రసాద్ ఈ ఘాతుకానికి ఒడిగట్టాడని ఎస్పీ చెప్పారు. నిందితుడి నుంచి రెండు సెల్‌ఫోన్లు, నగదు, నాలుగు బంగారు గాజులను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. నిందితుడు దుర్గాప్రసాద్‌ను ఫాస్ట్‌ట్రాక్ కోర్టులో ప్రవేశపెట్టి కఠిన శిక్ష పడేలా చార్జీషీటు ఫైల్ చేస్తామని ఆయన చెప్పారు. హత్య కేసును గంటల వ్యవధిలోనే ఛేదించిన పోలీసు దర్యాప్తు బృందాలను, క్లూస్ టీమ్‌ను, డీఎస్పీ శ్రావణి, సీఐ అల్లు స్వామినాయుడు, ఎస్ఐలు లక్ష్మణరావు, మనోజ్‌కుమార్, పోలీసు సిబ్బందిని ఎస్పీ తుహిన్ సిన్హా అభినందించారు.

వైసీపీకి ఆరుగురు కార్పొరేటర్లు గుడ్‌బై

- ఐదుగురు టీడీపీలో, మరొకరు జనసేనలో చేరిక
- నేడు మరో ఆరుగురు వైసీపీ నుంచి టీడీపీ, జనసేనలో చేరే అవకాశం


అమరావతిలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు సమక్షంలో టీడీపీ, జనసేనలో చేరిన వైసీపీ కార్పొరేటర్లు

విశాఖపట్నం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): వైసీపీకి చెందిన ఆరుగురు కార్పొరేటర్లు ఆ పార్టీకి గుడ్‌బై చెప్పేశారు. ఐదుగురు టీడీపీలో, మరొకరు జనసేనలో చేరారు. వైసీపీకి చెందిన 13వ వార్డు కార్పొరేటర్ కెల్ల సునీత, 17వ వార్డు కార్పొరేటర్ గేదెల లావణ్య, 73వ వార్డు కార్పొరేటర్ భూపతిరాజు సునీత, 54వ వార్డు కార్పొరేటర్ చల్లా రజని, 57వ వార్డు కార్పొరేటర్ ముర్రు వాణిలు గురువారం అమరావతిలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు సమక్షంలో ఆ పార్టీ కండువాలు కప్పుకున్నారు. 36వ వార్డు కార్పొరేటర్ మానిపోగు మేరీ జోన్స్ జనసేనలో చేరారు. దీంతో జీవీఎంసీ కౌన్సిల్‌లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి బలం 60కి పెరిగింది. శుక్రవారం మరో ఆరుగురు కార్పొరేటర్లు వైసీపీని వీడి టీడీపీ, జనసేనలో చేరే అవకాశం ఉందంటున్నారు. అదే జరిగితే కూటమి బలం 66కి పెరుగుతుంది. వీరు కాకుండా ఎక్స్ అఫీషియో సభ్యులుగా కూటమికి ఎనిమిది మంది ఎమ్మెల్యేలు, ఇద్దరు ఎంపీలు, ఒక ఎమ్మెల్సీ మొత్తం 11 మంది ఉన్నారు. వారితో కలిపితే కౌన్సిల్‌లో కూటమికి 77 మంది బలం ఉన్నట్టవుతుంది. మేయర్ గొలగాని హరివెంకటకుమారిపై అవిశ్వాస తీర్మానం నెగ్గాలంటే 74 మంది సభ్యులు బలం అవసరం.

ఉపాధి పనుల్లో ఎఫ్ఏల చేతివాటం

... 5వ పేజీ తరువాయి

మస్తర్లు వేసి 42 రోజుల వేతనాన్ని చెల్లించారు. ఈమె నుంచి ఫీల్డ్ అసిస్టెంట్ పండూరి లలిత రూ.5 వేలు తీసుకున్నట్టు గుర్తించారు. అయితే తన మీద ఉద్దేశపూర్వకంగా అభియోగాలు మోపుతూ రాజకీయ కక్ష సాధింపులకు పాల్పడుతున్నారని ఫీల్డ్ అసిస్టెంట్ పండూరి లలిత ఆరోపించారు. ఈ ఉద్యోగంలో ఉండాలంటే రూ.5 లక్షలు లంచంగా ఇవ్వాలని స్థానిక నాయకులు డిమాండ్ చేశారని, సొమ్ము ఇవ్వకపోవడంతో అభియోగాలు మోపుతున్నారని ఆమె అన్నారు. అవసరమైతే న్యాయస్థానాన్ని కూడా ఆశ్రయిస్తానన్నారు. ఈ సందర్భంగా డ్వామా పీడీ ఆర్.పూర్ణిమాదేవి మాట్లాడుతూ, ఉపాధి హామీ పథకంలో అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. రికార్డులు సక్రమంగా నిర్వహించాలని సూచించారు.

ప్రజలకు చేరువగా ఎమ్మెల్యేలు

... 5వ పేజీ తరువాయి

నియోజకవర్గం అధ్యక్షుడు, జోనల్ కో-ఆర్డినేటర్లతో కలిసి పార్టీ క్యాడర్‌తో సమావేశం నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఈ సమావేశాల పూర్తి వివరాలను పార్టీ కేంద్ర కార్యాలయానికి పంపాల్సి ఉంటుందన్నారు. పార్టీ అధిష్ఠానం నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం ఏదైనా నియోజకవర్గంలో సమావేశాలు నిర్వహించకపోతే అందుకుగల కారణాలను లిఖితపూర్వకంగా కేంద్ర కార్యాలయానికి పంపాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. పార్టీ సంస్థాగత నిర్మాణంలో భాగంగా ప్రతి పోలింగ్ బూత్ పరిధిలో 60 మంది ఓటర్లకు ఒక 'కుటుంబ సాధికార సారథి' ఉండేలా ఏప్రిల్ 15వ తేదీలోగా నియామకాలు జరుపుతామని ఆయన పేర్కొన్నారు. గ్రామ స్థాయి నుంచి పార్లమెంట్ స్థాయి వరకు ప్రధాన, అనుబంధ కమిటీల నియామకాలను వచ్చే నెల 30వ తేదీలోగా పూర్తి చేస్తామని తాతయ్యబాబు చెప్పారు.

టెన్త్ హిందీ బిట్ పేపర్‌లో ఆరో ప్రశ్న గందరగోళం

నర్సీపట్నం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి హిందీ బిట్ పేపర్‌లో ఆరో ప్రశ్న విద్యార్థులను గందరగోళానికి గురి చేసిందని స్థానిక హిందీ ఉపాధ్యాయుడు కోట ప్రసాద్ పేర్కొన్నారు. ఈ విషయాన్ని లేఖ ద్వారా విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకెళ్లినట్టు చెప్పారు. పదో తరగతి విద్యార్థులకు బుధవారం నిర్వహించిన హిందీ పరీక్ష బిట్ పేపరులోని ఆరో ప్రశ్నకు ఇచ్చిన మూడు మల్టిపుల్ ఆన్సర్స్‌లో ఒకటి, మూడు సమాధానాల్లో విద్యార్థులు ఏది ఎంపిక చేసినా మార్కు ఇవ్వాలని కోరారు. హిందీ ఉపాధ్యాయులు తయారు చేసిన పల్నాడు జిల్లా హిందీ స్టడీ మెటీరియల్ పుస్తకంలో ఆరో బిట్‌కి మూడో జవాబుని సూచించారని, ఎస్‌సీఈఆర్‌టీ నిపుణులు ఒకటో జవాబును సూచిస్తున్నారని, అందువల్ల ఆరో బిట్‌కి ఒకటి, మూడు సమాధానాల్లో ఏది ఎంపిక చేసినా మార్కు ఇవ్వాలని కోరారు.

ప్రభుత్వ భూములు హాంఫట్!

... 5వ పేజీ తరువాయి

సందర్శించి సర్వే చేయించారు. సబ్బవరం, గాజువాక మండలాల రెవెన్యూ రికార్డుల్లో లేని ప్రభుత్వ భూమి 87 సెంట్లు, వెదుళ్లనరవ సర్వే నంబరు 118లోని 40 సెంట్లుకు కలిపి హెచ్చరిక బోర్డు పెట్టారు. అయినప్పటికీ రెండు నెలలు తరువాత సదరు రియల్టర్ ప్రహరీగోడ నిర్మాణాన్ని పూర్తిచేశాడు. రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డు పెట్టి చేతులు దులుపుకున్నారే తప్ప ప్రహరీ గోడను మాత్రం కూల్చివేయలేదు. ప్రస్తుతం ఇక్కడ చదరపు గజం రూ.30 వేలు పలుకుతున్నది. ఈ లెక్కన ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమి విలువ రూ.10 కోట్లకుపైగానే వుంటుంది. ఆక్రమించిన ప్రభుత్వ భూమిని అమ్మేసుకుని సొమ్ము చేసుకునేందుకు రియల్టర్ ప్రయత్నిస్తున్నట్టు తెలిసింది. ప్రహరీగోడ తొలగించకపోవడం ఇందులో భాగమేనని అంటున్నారు.

వెదుళ్లనరవ సర్వే నంబరు 113లో వాగు పోరంబోకు 1.85 ఎకరాలుగా రికార్డుల్లో ఉంది. కానీ క్షేత్రస్థాయిలో భూమి లేదు. దీనికి ఆనుకుని జిరాయితీ సర్వే నంబరు 74 ఉంది. ఈ జిరాయితీ నంబరు వేసి, సర్వే నంబరు 113లో వున్న ప్రభుత్వ భూమిని దర్జాగా అమ్మేసుకున్నారు. అయినప్పటికీ రెవెన్యూ అధికారులు పట్టించుకోలేదు.

క్రైం... crime news

బైక్‌ను ఢీకొన్న వ్యాన్.. యువకుడి మృతి

పాడేరురూరల్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఘాట్ రోడ్డులో మండలంలోని మినుములూరు సమీపంలో గురువారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు మృతిచెందాడు. ఎస్ఐ ఎ.సూర్యనారాయణ అందించిన వివరాల ప్రకారం.. హుకుంపేట మండలం గొందిరాప గ్రామానికి చెందిన సోమెలి వెంకటరమణ (26) విశాఖపట్నంలోని షిప్‌యార్డ్‌లో అప్రెంటీస్ చేస్తున్నాడు. గురువారం ఉదయం విశాఖ నుంచి బైక్‌పై గొందిరాప వస్తున్నాడు. మినుములూరు సమీపంలోని మొదటి మలుపు వద్ద ఎదురుగా వస్తున్న వ్యాన్ ఢీకొన్నది. దీంతో వెంకటరమణ తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ప్రమాదంపై అందిన సమాచారం మేరకు ఎస్ఐ, పోలీసు సిబ్బంది సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతదేహాన్ని స్థానిక జిల్లా ఆస్పత్రి మార్చురీకి తరలించి, పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

అనుమానాస్పదంగా ఒకరి మృతి


రాము (ఫైల్ ఫొటో)

నక్కపల్లి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నల్లమట్టిపాలెం గ్రామానికి చెందిన నల్లమట్టి రాము(54) రాజయ్యపేట గ్రామ సమీపాన అనుమానాస్పదంగా మృతి చెందినట్టు అతని కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ సన్నిబాబు తెలిపారు. బుధవారం సాయంత్రం రాము కల్లు తాగేందుకు రాజయ్యపేట వెళ్లాడని, రాత్రి ఇంటికి రాలేదని, గురువారం ఉదయం రాజయ్యపేట సమీపాన కల్లుపాకల వద్ద చనిపోయివున్నాడని ఎస్ఐ చెప్పారు. రాము కుమారుడు దుర్గా ప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

మేడివాడలో రైతుల మధ్య ఘర్షణ, కొట్లాట


గాయపడిన శేషు, గణేశ్, శ్రీను, సంజీవరావు

రావికమతం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): పంట భూమిలో నుంచి ట్రాక్టర్ వెళ్లిన విషయమై రైతుల మధ్య గొడవ జరిగి కొట్లాటకు దారితీసింది. ఈ సంఘటనకు సంబంధించి ఎస్ఐ ఎం.రఘువర్మ తెలిపిన వివరాలిలా వున్నాయి. మండలంలోని మేడివాడ గ్రామానికి చెందిన కేశంశెట్టి శేషు, గణేశ్‌లకు, ఇదే గ్రామానికి చెందిన సీతిన శ్రీను, సంజీవరావులకు దిడ్డి, బాదనపాడు రెవెన్యూ పరిధిలో పక్క పక్కనే వ్యవసాయ భూములు వున్నాయి. వ్యవసాయ పనుల నిమిత్తం శ్రీను, సంజీవరావు గురువారం ఉదయం శేషు, గణేశ్‌లకు చెందిన పొలంలో నుంచి ట్రాక్టర్‌ను తీసుకెళ్లారు. తమను అడగకుండా పంట పొలంలో నుంచి ట్రాక్టర్ ఎందుకు తీసుకెళ్లారంటూ శేషు, గణేశ్ నిలదీశారు. దీంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం జరిగి ఘర్షణకు దారితీసింది. కర్రలతో పరస్పరం కొట్టుకున్నారు. దీంతో నలుగురికీ గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం రావికమతం పీహెచ్‌సీకి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి వెళ్లారు. ఈ సంఘటనపై కేసులు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

సీజ్ చేసిన ఎక్సైజ్ వాహనాల దగ్ధం


మంటలు అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

నర్సీపట్నం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): నర్సీపట్నం నుంచి చింతపల్లి వెళ్లే రోడ్డు పక్కన ఎక్సైజ్ శాఖ అధికారులు వుంచిన రెండు వాహనాలు దగ్ధమయ్యాయి. గంజాయి, మద్యం కేసుల్లో సీజ్ చేసిన వాహనాలను స్టేషన్ ఆవరణలో ఉంచడానికి ఖాళీ స్థలం లేకపోవడంతో చింతపల్లి వెళ్లే రోడ్డులో 26 వాహనాలు ఉంచారు. వీటి పక్కన ఉన్న పొలంలో ఎండిపోయిన గడ్డికి గురువారం మధ్యాహ్నం రైతులు నిప్పు పెట్టారు. ఈ సమయంలో గాలి అధికంగా వీచడంతో మంటలు వాహనాలకు వ్యాపించాయి. దీనిని గమనించిన ఎక్సైజ్ ఎస్ఐ స్థానిక అగ్నిమాపక కేంద్రానికి ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక అధికారి అప్పలస్వామి సిబ్బందితో వచ్చి మంటలు అదుపు చేశారు. అప్పటికే ఒక జీప్, వ్యాన్ దగ్ధమయ్యాయి.

అధిక లోడుతో వెళుతున్న రెండు లారీలకు జరిమానా

అనకాపల్లి టౌన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): అధిక లోడుతో మెటల్ రవాణా చేస్తున్న రెండు లారీలకు బుధవారం సాయంత్రం జరిమానా విధించినట్టు ట్రాఫిక్ సీఐ ఎం.వెంకటనారాయణ గురువారం తెలిపారు. కూండ్రం రోడ్డులోంచి రెండు లారీలు కొత్తూరు జంక్షన్‌లోని హైవేకు భారీ లోడుతో వెళుతుండగా తనిఖీ చేసి ఒక లారీకి రూ. 58వేలు, మరో లారీకి రూ. 68 వేలు జరిమానాలు విధించినట్టు ఆయన తెలిపారు.

డ్రంకన్ డ్రైవ్ కేసులో ముగ్గురికి జైలు శిక్ష

నక్కపల్లి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): డ్రంకన్ డ్రైవ్ కేసులో పట్టుబడిన ముగ్గురికి ఎలమంచిలి ఏజేఎఫ్‌సీ కోర్టు గురువారం నాలుగు రోజులు జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పినట్టు సీఐ కె.కుమారస్వామి చెప్పారు. బుధవారం హైవేపై డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తుండగా కె.కోటపాడుకు చెందిన ఎం.శ్రీను,నాతవరం మండలం నడుంపాలెంకు చెందిన గుర్రాల చిన అప్పన్న, ఉపమాకకు చెందిన గొర్ల సువర్ణరాజును పట్టుకుని కేసు నమోదు చేశామన్నారు. గురువారం ఎలమంచిలి కోర్టులో హాజరుపరచగా ఒక్కొక్కరికీ నాలుగు రోజులు జైలు శిక్ష విధించినట్టు సీఐ చెప్పారు.

20 లీటర్ల సారా స్వాధీనం : ఇద్దరి అరెస్టు


గుంటపల్లి గ్రామంలో పట్టుకున్న సారాతో ఎక్సైజ్ పోలీసులు

పాయకరావుపేట రూరల్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గుంటపల్లి గ్రామంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ పోలీసులు గురువారం విస్తృత దాడులు నిర్వహించి ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి వారి నుంచి 20 లీటర్ల సారా, 200 లీట్ల బెల్లం ఊటను స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి ఎక్సైజ్ సీఐ జి.శ్రీనివాసరావు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. నవోదయ 2.0లో భాగంగా విశాఖపట్నం ఎన్‌ఫోర్స్‌మెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ పి.అప్పారావు దత్తత తీసుకున్న పాయకరావుపేట మండలం గుంటపల్లి గ్రామంలో ఆయన ఎక్సైజ్ సిబ్బందితో దాడులు నిర్వహించగా అదే గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు 20 లీటర్ల నాటుసారా, 200 లీటర్ల బెల్లం ఊటతో పట్టుబడ్డారు. నిందితులపై కేసు నమోదుచేసి రిమాండ్‌కి తరలించారు. ఈ దాడుల్లో ఎస్ఐ పి.అప్పారావుతోపాటు సిబ్బంది జి.అప్పారావు, ఆర్.జగన్నాథ్, జె.నాగప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	87.00
లైవ్ ధర	107.00
విత్ స్కిన్	184.00
స్కిన్ లెస్	194.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	420
విజయనగరం	424
శ్రీకాకుళం	424